నేటి కందం-నేటికి అందం

శిల్పారామము నందున
స్వల్పమ్మగు నీడ నొసగు సద్యత్నముగా
పొల్పయిన యువత కొరకొక
కల్పకముగ జరిగినది "మెగా జాబ్ మేళా" !!

(హైదరాబాద్ లోని శిల్పారామం లో యువతకు మేలు చేకూర్చే "మెగా జాబ్ మేళా" నిర్వహించ బడింది. ప్రతిభావంతులైన యువకులకు యువతులకు ఉపాధి అవకాశాలు లభించాయి. ఇది రాష్ట్రం మొత్తానికి సంతోషాన్ని కలిగించింది.)

-రాధశ్రీ
సెల్:9494481210




# నేటి నిజం

తెలుగు దినపత్రిక


website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com


చురక

స్వాతంత్ర్య పోరులో
సైమన్ గో బ్యాక్ నాదు
స్వపరిపాలనలో
సర్ గో బ్యాక్ నేడు.
ప్రజాస్వామ్య హననంలో
పుడుతుందొక నినాదం
పరిణమించు అదే పిదప
ప్రజల సమర నాదం

-వేల్పుల నారాయణ
9440433475




హైదరాబాద్ బుధవారం 30-9-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:51 పేజీలు:6 వెల: రూ.1/-


## భక్తుల విశ్వాసానికి ప్రతీక రాజన్న ఆలయం

### -ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం.. -మంత్రి పొన్నం ప్రభాకర్



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 29:(నేటి నిజం ప్రతినిధి): సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వేములవాడ భీమేశ్వరాలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు.

రాజరాజేశ్వరస్వామి ఆలయం కేవలం ఒక దేవాలయం మాత్రమే కాదని.. కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీక అని పేర్కొన్నారు. భక్తుల ఆకాంక్షలను గౌరవిస్తూ ఆలయాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం, అన్నదాన సత్రం, గోశాల, వసతి సౌకర్యాలు, పార్కింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. భక్తులు ప్రశాంతంగా స్వామివారిని దర్శించుకుని తిరిగి వెళ్లేలా సమగ్ర కార్యాచరణతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వేములవాడతో పాటు భద్రాద్రి, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరం తదితర ప్రముఖ ఆలయాల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. వేములవాడ ఆలయ అభివృద్ధి కోసం గతంలో ప్రజలు, భక్తులు అనేక సందర్భాల్లో తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆ ఆకాంక్షలను ప్రభుత్వం గౌరవిస్తోందన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఇప్పటికే ఆదేశించినట్లు చెప్పారు.

ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి

వేములవాడను తెలంగాణలోనే కాకుండా దేశవ్యాప్తంగా ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు అవసరమైన ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు సమన్వయంతో పనిచేస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం మంచిది కాదని మంత్రి వ్యాఖ్యానించారు. ప్రతి ఒక్కరికీ తమ తమ ఆరాధ్య దైవాలపై విశ్వాసం ఉంటుందని, ఇతరుల విశ్వాసాలను గౌరవించడం తెలంగాణ సంస్కృతిలో భాగమన్నారు. మంత్రిగా, ప్రజాప్రతినిధిగా వేములవాడ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాజన్న స్వామి ఆశీస్సులు తెలంగాణ ప్రజలందరిపై ఉండాలని మంత్రి మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఆయన వెంట వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తో పాటు పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు తదితరులు ఉన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని నవ్వులపాలు చేస్తున్నారు.. ఈటల ఆగ్రహం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29: 'మేమే ఓట్లని ట్యాంపరింగ్ చేస్తే మాకు 400 ఎంపీ సీట్లు వచ్చేవి.. కానీ 240 సీట్లకు మాత్రమే బీజేపీ పరిమితం అయ్యింది' అని ఆ పార్టీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఈరోజు(మంగళవారం) మీడియాతో మాట్లాడుతూ.. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని చూసి జనం ఛీ కొడుతున్నారని వ్యాఖ్యానించారు. భారత ప్రజాస్వామ్యాన్ని నవ్వులపాలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో 'సర్' అనేది కొత్తది కాదని తెలిపారు. ఈవీఎంలను తీసుకొచ్చిందే రాజీవ్ గాంధీ అని గుర్తుచేశారు. వీవీ ప్యాట్‌లను తీసుకువచ్చింది మోదీ ప్రభుత్వమని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

కాంగ్రెస్ ముక్త్ భారత్.. రాహుల్ గాంధీతోనే సాధ్యమని బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ వ్యాఖ్యానించారు. పౌరసత్వానికి ముందే సోనియా గాంధీకి ఓటు ఎలా వచ్చిందో రాహుల్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈసీని వాడుకొని వారికి పదవులు ఇచ్చిందే కాంగ్రెస్ అంటూ దుయ్యబట్టారు. ఎన్నికల్లో గెలవలేక లేనిపోని సమస్యలు సృష్టిస్తున్నారని ఆరోపించారు.






## నాకు మంత్రి పదవి పోవడంపై బాధగా లేదు..

### కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు



వరంగల్, సెప్టెంబర్ 29: తనకు మంత్రి పదవి పోవడం బాధగా లేదని ఎమ్మెల్యే కొండా సురేఖ వ్యాఖ్యానించారు. మంత్రిగా ఉంటే రాష్ట్రస్థాయిలో సేవచేసే అవకాశం తనకు ఉండేదని పేర్కొన్నారు. ఈరోజు (మంగళవారం) వరంగల్ జిల్లాలోని తన క్యాంపు కార్యాలయంలో అంఖీఈ చెక్కులను కొండా సురేఖ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇప్పుడు వరంగల్ నియోజకవర్గంపై దృష్టి సారించి అభివృద్ధి చేసే అవకాశం తనకు వచ్చిందని కొండా సురేఖ వెల్లడించారు. ఇకపై నియోజక వర్గంలో అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పుకొచ్చారు. వచ్చే వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలను గెలవడమే తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. తమ అనుచరులపై ఈగవాలిన ఊరుకోబోమని హెచ్చరించారు. మొన్న ఎంజీఎం దగ్గర బీఆర్ఎస్ నేతలు అత్యుత్సాహం ప్రదర్శించారని ధ్వజమెత్తారు. వాళ్లు వాళ్లే తోసేసుకుని పోలీసులు కొట్టారని ఆస్పత్రిలో జాయిన్ అయ్యారని కొండా సురేఖ విమర్శించారు. కొత్త కలెక్టరేట్ దగ్గర బీజేపీ నాయకులు నిరసన తెలిపి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహించారు. వరంగల్ అభివృద్ధిపై బీజేపీ నాయకులకు సవాల్ చేశారు. వరంగల్‌లో పురాతన ప్రదేశాలను అభివృద్ధి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి.. అప్పుడు మాట్లాడాలని కొండా సురేఖ ఛాలెంజ్ చేశారు.

## 'మేము చమురు అమ్ముకుంటే.. ఎవ్వరినీ అమ్మనివ్వం': ఇరాన్

న్యూ ఢిల్లీ, సెఫ్టెంబర్ 29: పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో ఇరాన్ భద్రతకు విఘాతం కలిగిస్తే ఈ ప్రాంతంలో ఉన్న ఏ ఒక్క మౌలిక సదుపాయం కూడా సురక్షితంగా ఉండదని ఇరాన్ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది, 'మేము చమురు అమ్మలేని పరిస్థితి వస్తే, ఈ ప్రాంతం నుంచి ఎవ్వరినీ కూడా చమురు అమ్మనివ్వం' అని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాకర్ ఘలీబాఫ్ అమెరికాను తీవ్రంగా హెచ్చరించారు.

ఈ సందర్భంగా ఇరాన్-ఇరాక్ యుద్ధంలో కీలకమైన అబాదాన్ ముట్టడిని ఘలీబాఫ్ గుర్తుచేశారు. 'బాథిస్ట్ (సద్దాం హుస్సేన్) దళాలు అబాదాన్ నగరానికి రవాణా మార్గాలను నిలిపివేసి, చమురు శుద్ధి కర్మాగారంపై దాడులు చేసి నగరాన్ని స్వాధీనం చేసుకోవాలని చూశాయి. కానీ ఇరాన్ ప్రజలు, విప్లవ పోరాటయోధులు దృఢ సంకల్పంతో కేవలం 48 గంటల్లోనే ఏడాది పొడవునా సాగిన ఆ ముట్టడిని ఛేదించారని వివరించారు.

నేడు కూడా అమెరికా.. ఇరాన్‌పై నౌకాదళ దిగ్బంధం, వైమానిక కారిడార్ల మూసివేత, తీవ్ర ఒత్తిడి ద్వారా ఆర్థిక దిగ్బంధం చేయడానికి ప్రయత్నిస్తోందని, 1980ల నాటి ప్లానింగ్, సైనిక వ్యూహాలతోనే అమెరికా ప్రయత్నాలను కూడా తిప్పికొడతామన్నారు. అమెరికా నుంచి వచ్చే ఏ రకమైన దాడికైనా ఇరాన్ 'సత్వర, కచ్చితమైన, బాధాకరమైన రీతిలో సమాధానం ఇస్తుందని ఘలీబాఫ్ స్పష్టం చేశారు.

ఉద్రిక్తతల మధ్య దౌత్యపరమైన పరిణామాలు

ఒకవైపు ఇరాన్ నుంచి హెచ్చరికలు వస్తుండగా, మరొకవైపు తెరవెనుక దౌత్య ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఖతార్ వేదికగా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, అమెరికా మధ్య పరోక్ష చర్చలు జరుగుతున్నాయి. న్యూక్లియర్ అంశంపై ఇరాన్ స్పష్టమైన హామీలు, పురోగతిని చూపిస్తేనే ఆంక్షల సడలింపు, స్తంభింపజేసిన నిధుల విడుదలకు సిద్ధమని ఓ అమెరికా అధికారి తెలిపారు. ప్రస్తుతం ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్, జారెడ్ కుష్నర్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో ఈ చర్చలకు నాయకత్వం వహిస్తున్నారు.

ట్రంప్ అసంతృప్తి

హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి ఇరాన్ చేసిన ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తిరస్కరించారు. 'వారు ఒప్పందం చేసుకోవాలనుకుంటున్నారు, కానీ అది మేము కోరుకునే ఒప్పందం కాదు. వారు పరిస్థితిని మెరుగుపర్చుకోలేదు' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

ఇరు దేశాలు అణుకార్యక్రమాలపై కాస్త సడలింపునకు సుముఖత వ్యక్తం చేసినప్పటికీ, నిబంధనలు, అమలు చేసే సమయం విషయంలో ఇంకా ఏకాభిప్రాయం కుదరలేదు. తాజా సమాచారం ప్రకారం అమెరికా అధికారిక స్పందన కోసం టెహ్రాన్ వేచి చూస్తోంది.

## డబుల్ ఇంజిన్ సర్కార్ జెట్ స్పీడ్‌తో ముందుకెళ్తోంది: సీఎం చంద్రబాబు

అమరావతి, సెప్టెంబర్ 28:జిల్లా: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పల్లె పండుగ 3.0 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం రామాపురంలో రూ.11,085 కోట్లతో గ్రామీణాభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ నిధుల్లో కేంద్ర వాటా రూ.5,391 కోట్లు కాగా.. రాష్ట్ర ప్రభుత్వం రూ.5,694 కోట్లు ఖర్చు చేయనుంది. ఈ సందర్భంగా రామాపురానికి నెల్లూరు, ప్రకాశం, కడప, నంద్యాల జిల్లాల నుంచి లక్షలాది మంది కూటమి నేతలు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు. దీంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. కాగా, ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, నిమ్మల రామానాయుడు, ఫరూఖ్, బీసీ జనార్దన్ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.

పల్లె పండుగ 3.0 ప్రారంభించిన అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. 'పల్లె పండుగ 3.0ని రూ.11,085 కోట్లతో ప్రారంభించాం. గ్రామాల్లో అద్భుతమైన మార్పునకు నాంది పలుకుతున్నాం. ఏపీని పునర్నిర్మాణం చేస్తామని 2024లో చెప్పాం. మీరు వేసిన ఓటు వృథా కాలేదు. డబుల్ ఇంజిన్ సర్కార్ జెట్ స్పీడ్‌తో ముందుకెళ్తోంది. 2024 కంటే ఇంకా ఎక్కువ హవా ఇప్పుడు కొనసాగుతోంది. పంచాయతీ ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని మా ఆడబిడ్డలు సంకేతాలిస్తున్నారు. గ్రామాలను అభివృద్ధి చేస్తున్న పవన్‌కు అభినందనలు. పంచాయతీరాజ్ శాఖలో పవన్ మార్క్ చూపించారు. కేంద్ర పథకాలను ఫాలోఅప్ చేసుకుంటూ పల్లెల్లో పనులు చేస్తున్నాం. వైసీపీ ప్రభుత్వంలో పల్లెలు కన్నీరు పెట్టుకున్నాయి. ఆ ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులూ రాకుండా చేసింది' అని పేర్కొన్నారు.

పేదలపై ప్రత్యేక దృష్టి పెడతాం. ఆర్థిక అసమానతలు తొలగించడమే మా ధ్యేయం. ఎన్నికలకి ముందు పరిస్థితులు ఎవరూ మరిచిపోకూడదు. రూ.10 లక్షల కోట్లు అప్పు వారసత్వంగా ఇచ్చి వెళ్లారు. నాలుగోసారి ముఖ్యమంత్రి అయిన నాకే మతి పోయింది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అన్నింటినీ నెరవేర్చింది. సూపర్ సిక్స్ సూపర్ సక్సెస్ చేశాం. గతేడాది లక్ష మంది ఆడబిడ్డలను పారిశ్రామికవేత్తలని చేశాం. ఈ ఏడాది ఐదు లక్షల మందిని పారిశ్రామికవేత్తలని చేస్తాం.

## ఎస్ఎల్‌బీసీ, కాళేశ్వరం పనులకు ఆర్మీ ఇంజినీరింగ్ అధికారుల సేవలు

హైదరాబాద్, సెప్టెంబర్ 29: శ్రీశైలం ఎడమ గట్టు కాలువ(ఎస్ఎల్‌బీసీ), కాళేశ్వరం ప్రాజెక్ట్ పనులకు ఆర్మీ ఇంజినీరింగ్ అధికారుల సేవలను తెలంగాణ ప్రభుత్వం వినియోగించుకోనుంది. ఇందుకోసం ఆర్మీలోని ఇంజినీరింగ్ అధికారుల సహాయాన్ని సర్కార్ కోరింది. దీనిపై స్పందించిన ఆర్మీ ప్రధాన కార్యాలయం.. ముగ్గురు ఆర్మీ అధికారుల పేర్లు రాష్ట్రానికి పంపించింది. డిప్యుటేషన్‌పై ముగ్గురు అధికారులను తీసుకునే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పర్యవేక్షణకు ఒక ఆర్మీ అధికారి, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లకు ఇద్దరు ఆర్మీ అధికారులను తీసుకోనున్నారు.

ఇటీవల ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేథ్‌తో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ అయిన విషయం తెలిసిందే. ఎస్ఎల్‌బీసీ సాంకేతిక సవాళ్లపై ఆర్మీ చీఫ్‌తో చర్చించారు. కల్నల్ పరీక్షిత్ మెహ్రా సేవలతో సానుకూల ఫలితాలు వస్తున్నాయని మంత్రి అన్నారు. ఈ సమావేశం అనంతరం ఆర్మీ హెడ్‌క్వార్టర్స్ స్పందించి.. ముగ్గురు ఆర్మీ అధికారుల పేర్లను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించింది. మరోవైపు.. 44 కిలోమీటర్ల ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో 35 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను 2028 జూన్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కాళేశ్వరం మూడు బ్యారేజీల పునరుద్ధరణకు శాస్త్రీయ పరీక్షలు నిర్వహించారు. మట్టి, కాంక్రీట్, పునాదుల పరీక్షలు తుది దశకు చేరాయి. ఐఐటీ బాంబే, ఏఎఫ్ఆర్‌వై ఇండియా ఆధ్వర్యంలో ఫలితాల విశ్లేషణ జరుగుతోంది. భద్రత, నాణ్యత విషయంలో రాజీ ఉండదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## బిహార్, యూపీ ఎమ్మెల్సీ ఎన్నికలకు బీజేపీ అభ్యర్థుల ఖరారు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 బిహార్, ఉత్తర్ ప్రదేశ్‌లో త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు మంగళవారం 10 మంది అభ్యర్థుల పేర్లను వెల్లడించింది. అలాగే మేజర్ నామినీల పేర్లను కూడా ప్రకటించింది.

బిహార్ నుంచి నామినీలుగా ఎంపికైన వారిలో నావల్ కిశోర్ యాదవ్, డాక్టర్ ఎన్‌కే యాదవ్ ఉన్నారు. ఇక యూపీ నుంచి నామినీలుగా ఎంపికైన వారిలో కేదార్ నాథ్ సింగ్, హరికిశోర్ తివారీతో పాటు మరో నలుగురు కూడా ఉన్నారు. అయితే, రెండు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలకు 10 మంది అభ్యర్థులుగా ప్రకటించినప్పటికీ వారి పేర్లను ఇంకా వెల్లడించలేదు. బిహార్‌లో నాలుగు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసిన అధిష్ఠానం.. యూపీలో ఆరు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది.


## అక్టోబర్ 2 జర్నలిస్టుల ఆందోళనను విజయవంతం చేద్దాం

### చిన్న పత్రికల సంపాదకులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి న్యాయమైన డిమాండ్ల సాధనకు సంఘదీతంగా గళమెత్తుదాం





హైదరాబలాద్, సెప్టెంబర్ 29: జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, వృత్తిపరమైన భద్రత, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 2న నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర చిన్న, మధ్యతరహా దినపత్రికలు, మ్యాగజైన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్‌బాబు, ప్రధాన కార్యదర్శి వై.ఎల్.అశోక్ పిలుపునిచ్చారు. చిన్న పత్రికల సంపాదకులు, వాటిలో పని చేస్తున్న జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని న్యాయమైన డిమాండ్ల సాధనకు సంఘటితంగా గళమెత్తాలని కోరారు. టీయూడబ్ల్యూజే-ఐజేయూ ఆధ్వర్యంలో అక్టోబర్ 2న నిర్వహించనున్న ఆందోళనకు తమ సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు వారు తెలిపారు. అక్టోబర్ 2న ఉదయం 12 గంటలకు హైదరాబాద్ అసెంబ్లీ ఎదురుగా గన్‌పార్క్ వద్ద జరిగే నిరసన కార్యక్రమానికి చిన్న పత్రికల సంపాదకులు, జర్నలిస్టులు హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. దేశ వ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు న్యాయమైన డిమాడ్ల సాధన కోసం జర్నలిస్టుల ఐక్య ఉద్యమాన్ని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) ఈ ఆందోళనకు పిలుపుని చ్చిందని పేర్కొన్నారు. జర్నలిస్టుల వృత్తిపరమైన హక్కులు, భద్రత, సంక్షేమం, సామాజిక రక్షణ తదితర అంశాలపై ప్రభుత్వాలు, సంబంధిత సంస్థలు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న జర్నలిస్టులు విధి నిర్వహణలో అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఐజేయూ, ఈయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె. విరాహత్ అలీ, రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో చిన్న పత్రికల సంపాదకులు, జర్నలిస్టులు భాగస్వాములు కావాలని యూసుఫ్ బాబు, అశోక్ కోరారు. "మన హక్కు=మన గళం=మన ఐక్యత'' అనే నినాదంతో జర్నలిస్టుల హక్కుల కోసం సంఘటితంగా గళం వినిపించాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 2న జరిగే ఆందోళనలో పెద్ద సంఖ్యలో పాల్గొని చిన్న పత్రికల సంపాదకులు, జర్నలిస్టుల ఐక్యతను చాటాలని విజ్ఞప్తి చేశారు.

# అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న మహిళా ఆరోగ్యం

## (30 సెప్టెంబర్ "జాతీయ మహిళ ఆరోగ్యం - ఫిట్‌నెస్ దినోత్సవం" సందర్భంగా)

కుటుంబ బాధ్యతలు, వ్యక్తిగత ఆశయ సాధనలు, పిల్లల పెంపకం, కెరీర్ బాధ్యతలతో సతమతం అవుతున్న మహిళలకు తమ వ్యక్తిగత ఆరోగ్యం, ఫిట్‌నెస్, శ్రేయస్సు పట్ల ఆలోచించే సమయం చాలా తక్కువగా ఉంటుంది. మహిళల ఆరోగ్యం, శ్రేయస్సుల పట్ల అవగాహన కల్పించడానికి ప్రతి ఏట సెప్టెంబర్ చివరి బుధవారం రోజున, అనగా 30 సెప్టెంబర్ 2026 రోజున "జాతీయ మహిళా ఆరోగ్యం – ఫిట్‌నెస్ దినోత్సవం (నేషనల్ వూమెన్ హెల్త్ అండ్ ఫిట్‌నెస్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. మహిళా ఆరోగ్యం చాలా సంక్లిష్టతతో కూడి పలు సవాళ్ల మధ్య ఊగిసలాడుతూ ఉంటుంది. మహిళలకు కౌమార దశ నుంచి వృద్ధాప్యం వరకు మోనోపాజ్, గర్భం దాల్చడం, పిల్లల్ని కనడం, రుతు స్రావ సమస్యలు, పిసిఓఎస్ సమస్యలు జీవితాంతం వెంటాడుతూనే ఉంటాయి. దీనికి తోడుగా ప్రతి చిన్న సమస్యను బూతద్దంలో చూస్తూ అనవసర ఆందోళన, నిరాశ, ఒత్తిడులు, పని ఆధార ఒత్తిడులు, సామాజిక కట్టుబాట్లకు లోనవుతూనే ఉంటారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని మహిళలకు అనారోగ్యం, శారీరక సమస్యలు, మానసిక ఉద్రేకాలు, భావోద్వేగ సమస్యలను అదుపులో ఉంచుకోవడానికి తగు సమాధానాలను ప్రచారం చేయడం నిరంతరం కొనసాగించాలి.

### మహిళా ఆరోగ్యం – ఫిట్‌నెస్ ప్రయోజనాలు:

కుటుంబ బాధ్యతలు, పని ప్రదేశ్ ఒత్తిడులు, పిల్లల పెంపకం బాధ్యతలు, వ్యక్తిగత సమస్యల పట్ల సమతుల్యత సాధించడానికి తమ ఆరోగ్యాలను సహితం పణంగా పెట్టడం జరుగుతోంది. మహిళల ఆరోగ్యం – ఫిట్‌నెస్ సాధించుట వల్ల జీవనశైలి వ్యాధుల బారిన పడకుండా ఉండడం, మానసిక శ్రేయస్సు పెరగడం, శారీరక శక్తి జననం, సరైన సమయంలో నిద్ర పోవడం, ఏకాగ్రత పెరగడం, దీర్ఘ కాలిక ఆరోగ్య ప్రయోజనాలు కలగడం, శారీరక వ్యాయామాలకు సమయం కేటాయించడం లాంటి ఉపయోగాలు కలుగుతాయి. మహిళలకు అందుబాటులో ఉన్న సమయాన్ని తగు రీతిలో ప్రాధాన్యతాక్రమంలో గడపడం, దిన చర్యలో శారీరక శ్రమకు ప్రాధాన్యం ఇవ్వడం, టెక్నాలజీ వాడుతూ తేలికగా పని చేయడం, సుసాధ్యం అయ్యే లక్ష్యాలను నిర్ణయించుకోవడం, అవసరం అయినపుడు పనిని ఇతరులకు కేటాయించడం, విశ్రాంతికి తగు సమయం కేటాయించడం, మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యం ఇవ్వడం లాంటివి విధిగా జరగాలి.

### మహిళా ఆరోగ్య పరిరక్షణ మార్గాలు:

మహిళలు తమ పని ఒత్తిడిలో తగు పోషకాహారాన్ని తీసుకోవడంలో విఫలం అవుతూ ఉంటారు. అందరూ తిన్న తర్వాత మింగిన దానిని తిని తమ అనారోగ్యాలను కొని తెచ్చుకుంటారు. సమతుల పోషకాహారం తీసుకోవడం, పోషకాహారలోపాలను గమనించి ఆహార అలవాట్లు మార్చుకోవడం, ప్రతి రోజు తగు నీటిని తాగడం, బరువును అదుపులో ఉంచుకోవడం, పోషకాహారాన్ని మాత్రమే తయారు చేయడం, ప్రాసెస్డ్ ఫుడ్ వాడకాన్ని తగ్గించడం, శరీర స్వభావాన్ని బట్టి ఆహారం ఎంపిక చేసుకోవడం లాంటి జాగ్రత్తలు తీసుకుంటూ మహిళలు తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలి.

మానసిక వికాసానికి అవసరమైన వ్యాయామాలు, ఒత్తిడి నియంత్రణ, మానసిక స్పష్టత, నిద్రలేమా సమస్యను దూరం చేయడం, ఆశావహ సామాజిక సంబంధాలను నెలకొల్పడం, నిలకడను పెంచుకోవడం, వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవడం, ఆత్మ గౌరవాన్ని కాపాడుతుంటే ముందుకు సాగడం లాంటివి కొనసాగించాలి.

మహిళలు తమ జీవనశైలిని తగు రీతిలో మార్చుకుంటూ, పోషకాహారం తీసుకుంటూ, కుటుంబ శ్రేయస్సుతో పాటు తమ ఆరోగ్యం పరిరక్షించుతుంటూ, ఇతరులకు మార్గదర్శకులుగా నిలుస్తూ, ఆదర్శ మహిళగా దూసుకుపోతూ, సామాజిక చైతన్యాన్ని కలుగజేస్తూ, వృత్తిలో పాణిస్తూ ముందుకు సాగడానికి ప్రతినబూనాలి.



–మధుపాలీ
9949700037

# ప్రామాణిక అశ్వగంధ వేర్ల సారంతో కాలేయం, మూత్రపిండాలకు ఎలాంటి హాని లేదని నిరూపించిన 24 వారాల అశ్వగంధ క్లినికల్ పరీక్ష

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 29:'ఫ్రాంటియర్స్ ఇన్ మెడిసిన్' లో ఇటీవల ప్రచురితమైన ఒక పెద్ద మల్టీసెంటర్ క్లినికల్ అధ్యయనం ప్రకారం ప్రామాణీకరించిన అశ్వగంధ వేర్ల సారాన్ని 24 వారాల పాటు ప్రతిరోజూ తీసుకోవడం సురక్షితమని.. చికిత్స కారణంగా కాలేయం లేదా మూత్రపిండాలకు ఎలాంటి హానీ జరగలేదని తేలింది.

"కొవిషీల్డ్ టీకా తీసుకున్న తర్వాత నివారణ కోసం 24 వారాల పాటు దీర్ఘకాలికంగా అశ్వగంధను తీసుకోవటం, తట్టుకునే శక్తి: ఒక మల్టీసెంటర్ ర్యాండమైజ్డ్ డబుల్-బ్లైండ్ ప్లాసిబో-నియంత్రిత పరీక్ష" అనే శీర్షికతో వెలువడింది. దీనిని సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్ (సీసీఆర్ఏఎస్), అఖిల భారత ఆయుర్వేద సంస్థ, జాతీయ ఆయుర్వేద సంస్థ(జైపూర్), ఆయుష్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ట్రాన్స్‌లేషనల్ హెల్త్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్, సెంటర్ ఫర్ కాంప్లిమెంటరీ అండ్ ఇంటిగ్రేటివ్ హెల్త్, పుణెలోని సావిత్రీబాయి పూలే విశ్వవిద్యాలయానికి చెందిన ఇంటర్ డిసిప్లినరీ స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వంటి 9 సంస్థలకు చెందిన బహుళ విభాగ పరిశోధకుల బృందం సంయుక్తంగా నిర్వహించింది.

ఆయుర్వేదం, క్లినికల్ మెడిసిన్, రుమటాలజీ, కాంప్లిమెంటరీ అండ్ ఇంటిగ్రేటివ్ హెల్త్, సంబంధిత విభాగాల నిపుణులతో కూడిన 9 సంస్థలకు చెందిన 45 మంది పరిశోధకుల బహుళ విభాగ బృందం ఈ అధ్యయనాన్ని నిర్వహించింది. ఈ ర్యాండమైజ్డ్, డబుల్-బ్లైండ్, ప్లాసిబో-నియంత్రిత పరీక్షలో కొవిషీల్డ్ టీకా మొదటి, రెండో లేదా బూస్టర్ డోస్ తీసుకున్న 18 నుంచి 70 సంవత్సరాల వయస్సు గల 1,200 మంది ఆరోగ్యకరమైన పెద్దలు పాల్గొన్నారు. వీరికి రోజు వారీగా ర్యాండమైజ్డ్ పద్ధతిలో 500 మి.గ్రాల ప్రామాణీకరించిన అశ్వగంధ వేర్ల రసాన్ని (ఇది 4 గ్రాముల ముడి వేరు పొడికి సమానం) లేదా దానికి సమానంగా ప్లాసిబోను అందించారు. భారత్‌లోని ఏడు అధ్యయన కేంద్రాలలో నిర్వహించిన ఈ పరిశోధనలో క్లినికల్, ప్రయోగ శాల, ఇమ్యునోలాజికల్ ప్రమాణాలను చేర్చారు. ఈ క్లినికల్ ట్రయల్ – ఇండియా (సీటీఆర్ఐ/2021/06/0344 96) క్లినికల్ ట్రయల్స్ రిజిస్ట్రీలో నమోదయింది.

పాల్గొన్నవారు 24 వారాల పాటు దీనిని తీసుకున్నారు. వారిని 28వ వారం వరకు పరిశీలించారు. నమోదు చేసుకున్న 1,200 మందిలో 1,032 మంది (86 శాతం) ఈ అధ్యయనాన్ని విజయవంతంగా పూర్తి చేశారు.

ప్రామాణీకరించిన అశ్వగంధ వేరు సారం 24 వారాల వ్యవధిలో అనుకూలమైన భద్రత, తట్టుకునే ప్రొఫైల్‌ను కలిగి ఉందని ఈ అధ్యయనం కనుగొంది. కాలేయం ఎంజైమ్‌లు, బిలిరుబిన్, క్రియాటినిన్, రక్తంలో యూరియా వంటి పరీక్షలతో సహా కాలేయం, మూత్రపిండాల పనితీరు ప్రమాణాలు సాధారణ స్థాయిలలోనే ఉన్నాయి. చికిత్స కారణంగా కాలేయానికి లేదా మూత్రపిండాలకు ఎలాంటి నష్టం జరగలేదని ఈ పరీక్షలు స్పష్టం చేశాయి.

అధ్యయనం కారణంగా ఎటువంటి తీవ్రమైన ప్రతికూల ప్రభావాలు నమోదుకాలేదని తేలింది. అలాగే ఏ ఒక్కరు కూడా ప్రతికూల ప్రభావం కారణంగా ఈ పరీక్ష నుంచి తప్పుకోలేదు.

ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వైద్య రాజేష్ కొటేచా మాట్లాడుతూ.. ప్రామాణీకరించిన ఆయుర్వేద పదార్థాల భద్రత, సరైన వినియోగానికి మద్దతు ఇచ్చే బలమైన శాస్త్రీయ ఆధారాలను ఈ ఫలితాలు అందిస్తున్నాయన్నారు. "నాణ్యమైన క్లినికల్ పరిశోధనలు ఆయుర్వేదానికి ఉన్న శాస్త్రీయ ఆధారాలను బలపరుస్తాయి.. సమకాలీన ఆరోగ్య సంరక్షణలో దాని సామర్థ్యాన్ని మరింత లోతుగా అర్థం చేసుకోవడానికి తోడ్పడతాయి. కఠినమైన క్లినికల్ అధ్యయనాల నుంచి పెరుగుతున్న ఈ ఆధారాలు ఆరోగ్యం, సంపూర్ణ ఆరోగ్య రంగాలలో ఆయుర్వేదాన్ని, దాని అనువర్తనాలను ప్రపంచవ్యాప్తంగా బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవడానికి కూడా మద్దతు ఇస్తున్నాయి'' అని ఆయన వ్యాఖ్యానించారు.

భారత్‌లోని పుణెలో ఉన్న సెంటర్ ఫర్ రుమాటిక్ డిసీజెసెస్ డైరెక్టర్, చీఫ్ రుమటాలజిస్ట్, ఆయుష్ విశిష్ట శాస్త్రవేత్త, ఈ అధ్యయనానికి ప్రధాన రచయిత అయిన డాక్టర్ అరవింద్ చోప్రా ఈ ఫలితాల ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ.. "24 వారాల పాటు నిర్వహించిన ఈ పెద్ద, మల్టీసెంటర్, ర్యాండమైజ్డ్ క్లినికల్ పరీక్ష.. ప్రామాణీకరించిన అశ్వగంధ విషయంలో భద్రత, తట్టుకునే శక్తిపై ముఖ్యమైన ఆధారాలను అందిస్తుంది. అధ్యయనం అంతటా కాలేయం, మూత్రపిండాల పనితీరు ప్రమాణాలు సాధారణ శారీరక స్థాయిలలోనే ఉన్నాయి. చికిత్స కారణంగా కాలేయం లేదా మూత్రపిండాలకు ఎలాంటి హాని జరగలేదు. టీకా ద్వారా లభించిన రోగనిరోధక శక్తికి అశ్వగంధ ఎలాంటి భంగం కలిగించలేదని కూడా ఈ అధ్యయనం నిరూపించింది. అశ్వగంధ, ప్లేసిబో రెండు గ్రూపులలోనూ అధిక స్థాయి న్యూట్రలైజింగ్ యాక్టివిటీ నిలకడగా కొనసాగింది. ఈ ఫలితాలు కఠినమైన, బాగా నియంత్రణలో ఉన్న క్లినికల్ పరిశోధనల ద్వారా ప్రామాణీకరించిన ఆయుర్వేద పద్ధతులను పరిశీలించాల్సిన ప్రాముఖ్యతను మరింత బలపరుస్తున్నాయి" అని వ్యాఖ్యానించారు.

ఆయుష్ జాతీయ పరిశోధన ప్రొఫెసర్, ఈ అధ్యయన సహ-రచయిత అయిన ప్రొఫెసర్ భూషణ్ పట్వర్ధన్ ఆయుర్వేదం కోసం అధిక-నాణ్యత గల సాక్ష్యాధారాలను సృష్టించడానికి ఉన్న ప్రాముఖ్యతను ప్రముఖంగా చెప్పారు. "సంప్రదాయ మూలాలను కోల్పోకుండా పటిష్ఠమైన సమకాలీన క్లినికల్ పరిశోధనల ద్వారా ఆయుర్వేదాన్ని ఎలా అంచనా వేయొచ్చో చెప్పడానికి ఈ అధ్యయనం ఒక ముఖ్యమైన ఉదాహరణ. 24 వారాల పాటు నిర్వహించిన ఈ పరీక్షలో గమనించిన అనుకూలమైన భద్రత, తట్టుకునే శక్తి స్థాయిలు.. ప్రామాణీకరించిన అశ్వగంధ ఉపయోగంపై క్లినికల్ ఆధారాలను మరింత బలోపేతం చేస్తాయి. అలాగే ఆరోగ్య సంరక్షణలో వాటిని బాధ్యతాయుతంగా ఏకీకృతం చేయడానికి సాక్ష్యాధారిత విధానాల ప్రాముఖ్యతను ఇవి ప్రధానంగా చెబుతున్నాయి" అని ఆయన పేర్కొన్నారు.

ఆయుర్వేద పదార్థాల ఉపయోగం కోసం పటిష్ఠమైన క్లినికల్ ఆధారాలను సృష్టించడానికి ఉన్న ప్రాముఖ్యతను చెప్పిన సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్ (సీసీఆర్ఏఎస్) డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ (వైద్య) రబీనారాయణ ఆచార్య .. "నియంత్రిత పరిస్థితులలో 24 వారాల పాటు ప్రామాణీకరించిన అశ్వగంధ వేరు సారం అందించినప్పుడు భద్రత, తట్టుకునే శక్తిపై ఈ మల్టీసెంటర్ క్లినికల్ ట్రయల్ ఫలితాలు విలువైన ఆధారాలను అందించాయి. ఆయుర్వేదం విషయంలో శాస్త్రీయ ఆధారాలను బలపరచడానికి, ప్రామాణీకరించిన ఆయుర్వేద పదార్థాల బాధ్యతాయుతమైన, సాక్ష్యాధారిత వినియోగానికి మద్దతు ఇవ్వడానికి ఇటువంటి చక్కగా రూపొందించిన క్లినికల్ అధ్యయనాలు ఎంతో ముఖ్యం" అని అన్నారు.

ప్రామాణీకరించిన అశ్వగంధ వేరు సారాన్ని 24 వారాల పాటు ఉపయోగించటం వల్ల కొవిషీల్డ్ టీకా తీసుకున్న వారి రోగనిరోధక శక్తిపై ప్రభావాన్ని కూడా ఈ అధ్యయనం అంచనా వేసింది. అశ్వగంధ, ప్లాసిబో రెండు గ్రూపులలోనూ వైరస్-న్యూట్రలైజింగ్ క్రియాశీలత 85 శాతానికి పైగా ఉంది.. రెండు గ్రూపుల మధ్య సంఖ్యాపరంగా ఎలాంటి గణనీయమైన వ్యత్యాసం కనిపించలేదు.

ఈ ఫలితాలు ప్రామాణీకరించిన అశ్వగంధ ఉపయోగంపై క్లినికల్ ఆధారాలను మరింత మెరుగుపరుస్తాయి. అలాగే వాటి సురక్షితమైన, సాక్ష్యాధారిత వినియోగానికి మద్దతు ఇవ్వడంలో పటిష్ఠమైన క్లినికల్ పరిశోధనల ప్రాముఖ్యతను ఇవి పునరుద్ఘాటిస్తున్నాయి.

# ఖానాపూర్ సీహెచ్‌సీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**అపరిశుభ్రతపై ఆగ్రహం**
**నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



ఆదిలాబాద్, సెప్టెంబర్ 29: నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వైద్య సేవలు, సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, ఆసుపత్రి పరిసరాలను ఆయన పరిశీలించారు.

ఆసుపత్రి పరిసరాల్లోని నీటి ట్యాంకు వద్ద పేరుకుపోయిన చెత్తను చూసి పరిశుభ్రత పాటించడంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని వైద్యాధికారులు మున్సిపల్ కమిషనర్ కు హెచ్చరికలు జారీ చేశారు. సిబ్బంది తప్పనిసరిగా సమయ పాలన పాటించాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఓపీ వార్డు, ఫార్మసీ, ఆపరేషన్ థియేటర్ గదులు, పోస్టు మార్టం గదులను పరిశీలించి వసతులపై ఆరా తీశారు. అనంతరం పాత బస్టాండ్ నుండి ప్రభుత్వ ఆసుపత్రి వరకు రోడ్డుపై వేసిన అక్రమ నిర్మాణాలపై ఆరా తీసి తొలగించాలని చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కు ఆదేశించారు. ఆయన వెంట ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ స్వర్ణ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, తహసీల్దార్ సుజాత, వైద్యాధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫుడ్ కమిషన్ తనిఖీలు

**మధ్యాహ్న భోజనం, మెనూ అమలుపై అధికారుల ఆరా**

ఆదిలాబాద్, సెప్టెంబర్ 29: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, సీతాగొంది అంగన్‌వాడీ కేంద్రాలను రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి, సభ్యుడు ఒరగంటి ఆనంద్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం నాణ్యత, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ అమలు, రికార్డుల నిర్వహణపై ఆరా తీశారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాణ్యమైన భోజనం అందడం లేదని విద్యార్థులు కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. కొందరు విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకుని తింటున్న విషయంపై అధికారులు, నిర్వాహకులపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఆదర్శ పాఠశాలలో సరఫరా చేసిన కోడిగుడ్లు తక్కువ బరువుతో ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై అవగాహన లేకపోవడంపై డీఈవో మాధవిని ప్రశ్నించారు.

కమిషన్ చైర్మన్ పర్యటనకు మండలస్థాయి అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడంపైనా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ రాథోడ్ రవీందర్, ఐసీడీఎస్ పీడీ మిల్కా, డీసీఎస్‌ఓ నందిని, సుధారాణి, ప్రత్యేక అధికారి బొంగురాల సునీత, ఎంఈఓ గోపాల్‌సింగ్ తిలావత్, ఇన్‌చార్జి ఎంహెచ్‌ఓ మేఘనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడేలా కృషి చేయాలి



ఆదిలాబాద్, సెప్టెంబర్ 29: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఆంగ్ల భాషను సమర్థవంతంగా మాట్లాడేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని నోడల్ ఆఫీసర్ లింగన్న, అసిస్టెంట్ నోడల్ అధికారి రాజేష్ నాయక్ సూచించారు.

మంగళవారం దస్తూరాబాద్ మండల కేంద్రంలోని బూత్కూర్, దస్తూరాబాద్ ప్రాథమిక పాఠశాలలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులను ఆయా తరగతులకు సంబంధించిన ప్రశ్నలు అడిగి వారి సమాధానాలను పరిశీలించారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాల విద్యను పూర్తి చేసే నాటికి ఆంగ్ల భాషలో అనర్గళంగా మాట్లాడేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ అవసరమైన శిక్షణ అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోట వేణు, అదనపు నోడల్ అధికారులు నరసయ్య, మహేశ్వర్, ఐఆర్‌పీ ఎడ్ల జగన్ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాలో జీ20 వాణిజ్య మంత్రుల సమావేశం: కేంద్ర వాణిజ్య-పరిశ్రమల మంత్రి శ్రీ పీయూష్ గోయల్ పయనం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29: కేంద్ర వాణిజ్య-పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ సెప్టెంబరు 29 నుంచి అక్టోబరు 5 దాకా అమెరికాలో పర్యటించడం కోసం ఇవాళ బయల్దేరారు. అమెరికా వాణిజ్య ప్రతినిధి (యూఎస్‌టీఆర్) ఆహ్వానం మేరకు సెప్టెంబరు 30-అక్టోబరు 1 తేదీలలో విస్కాన్సిన్‌లోని మిల్వాకీలో నిర్వహించే జీ20 కూటమి దేశాల వాణిజ్య మంత్రుల సమావేశంలో ఆయన పాల్గొంటారు.

ఈ సమావేశంలో ప్రపంచ వాణిజ్య సంస్థ కేంద్రకంగా నియమాధారిత, సార్వత్రిక, సమ్మిళిత, పారదర్శక, సమాన, వివక్ష రహిత బహుపాక్షిక వాణిజ్య వ్యవస్థ దిశగా జీ20 సభ్య దేశాలతో భారత్ నిర్ణయాత్మక చర్చల్లో పాల్గొంటుంది. అలాగే, వర్ధమాన దేశాలకు తగుమేర విధానపరమైన వెసులుబాటు కూడా కల్పిస్తుంది. మరోవైపు ఇతర దేశాల వాణిజ్య మంత్రులతో శ్రీ గోయల్ ద్వైపాక్షిక చర్చల్లోనూ పాల్గొంటారు. రైతులు, మత్స్యకారులు, మహిళా పారిశ్రామికవేత్తలు, అంకుర సంస్థలు, 'ఎంఎస్ఎంఈ'లు, ఇతర సంస్థలకు అవకాశాల విస్తరణపై ఈ సందర్భంగా దృష్టి సారిస్తారు.

భారత్-అమెరికా సమతుల, పరస్పర ప్రయోజనకర ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) పురోగమనం దిశగా నిరంతర కృషి కొనసాగుతోంది. ఇందులో భాగంగా 2026 ఫిబ్రవరి 7 నాటి సంయుక్త ప్రకటనకు అనుగుణంగా ఒక మధ్యంతర ఒప్పందం ఖరారుకు శ్రీ పీయూష్ గోయల్ అమెరికా వాణిజ్య మంత్రితోనూ ద్వైపాక్షికంగా సంప్రదింపుల్లో పాల్గొంటారు.

ఈ పర్యటనలో భాగంగా మిల్వాకీ, షికాగో నగరాల్లో తయారీ, వినియోగ వస్తువులు, వ్యవసాయ వాణిజ్యం, రిటైల్, టెక్నాలజీ రంగాల్లోని ప్రసిద్ధ అమెరికా కంపెనీల ముఖ్య కార్యనిర్వహణాధికారులతోనూ శ్రీ గోయల్ సమావేశమవుతారు. దీంతోపాటు వాణిజ్య, అంకుర సంస్థలు సహా వినూత్న కంపెనీలతో రౌండ్‌టేబుల్ సమావేశాల్లో పాల్గొంటారు.

# గిరిజన విద్యాసంస్థల్లో సంతృప్తికర వసతులు

**విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడిన డీటీడీఓ నాగసాగర్..**
**సాధారణ మెనూ, విద్యాబోధన, మౌలిక వసతులపై ఆరా**



కరీంనగర్, సెప్టెంబర్ 29 జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గిరిజన సంక్షేమ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, విద్యాబోధన, సాధారణ మెనూ అమలుపై డీటీడీఓ జి. నాగసాగర్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. సోమవారం ఆరు గిరిజన సంక్షేమ పాఠశాలలను సందర్శించిన ఆయన విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

భూపాలపల్లిలోని గిరిజన సంక్షేమ ప్రధానమంత్రి వసతిగృహ బాలికల, బాలుర పాఠశాలలు, మేడిపల్లిలోని గిరిజన సంక్షేమ ఆదర్శ ఉన్నత పాఠశాల బాలికల విభాగం, మహదేవ్‌పూర్‌లోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత ప్రాథమిక పాఠశాల బాలికల విభాగం, ఎస్టీ బాలుర వసతిగృహం, కాళేశ్వరంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాల బాలికల విభాగాన్ని పరిశీలించారు. సిబ్బంది సమక్షం లేకుండా విద్యార్థులతో విడివిడిగా మాట్లాడిన డీటీడీఓ.. ప్రభుత్వం నిర్దేశించిన సాధారణ మెనూ అమలు, విద్యాబోధన, మౌలిక వసతులు, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు.

ఆయా విద్యాసంస్థల్లో మెనూ చార్ట్ ప్రకారం ఆహారం అందిస్తున్నారని, సాధారణ మెనూ బాగుందని విద్యార్థులు తెలిపినట్లు డీటీడీఓ పేర్కొన్నారు. విద్యాబోధనతో పాటు అన్ని రకాల సౌకర్యాలు సంతృప్తికరంగా ఉన్నాయని, తమకు ఎలాంటి ఇబ్బందులు, ఫిర్యాదులు లేవని విద్యార్థులు వెల్లడించినట్లు తెలిపారు. ఆరు పాఠశాలల విద్యార్థుల నుంచి నేరుగా వివరాలు సేకరించిన అనంతరం పరిస్థితిపై ఉన్నతాధికారులకు డీటీడీఓ నాగసాగర్ నివేదిక అందజేశారు

# ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు: మండల వ్యవసాయ అధికారి జ్యోతి



కరీంనగర్, సెప్టెంబర్ 29కొడిమ్యాల మండలంలోని వివిధ ఎరువులు, పురుగు మందుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి పి. జ్యోతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వ వివరాలు, రిజిస్టర్లు, పురుగు మందుల నిల్వలు, రిజిస్టర్లు, బిల్లులను పరిశీలించారు.

అనుమతి లేని కంపెనీల నుంచి నిల్వలు తెప్పించినా, లైసెన్సులో నమోదు కాని కంపెనీలకు చెందిన ఎరువులను విక్రయించినా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి హెచ్చరించారు. అలాగే ప్యాకెట్‌పై సూచించిన ధరల కంటే అధికంగా విక్రయించినట్లు తేలితే ఎరువుల చట్టం ప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# ముంబయి వేదికగా 14వ భారత్-యూఏఈ ఉన్నత స్థాయి జాయింట్ టాస్క్ ఫోర్స్ సమావేశం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29భారత్-యూఏఈ పెట్టుబడులపై ఉన్నత స్థాయి జాయింట్ టాస్క్ ఫోర్స్ (హెచ్ఎల్‌జేటీఎఫ్ఐ) 14వ సమావేశం నేడు ముంబయిలో జరిగింది. ఈ సమావేశానికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్, అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ) మేనేజింగ్ డైరెక్టర్ షేక్ హమీద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ సహాధ్యక్షత వహించారు.

భారత్-యూఏఈ మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, ఆర్థిక సంబంధాలను ప్రోత్సహించేందుకు 2013లో హెచ్ఎల్‌జేటీఎఫ్ఐని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి భారత్, యూఏఈల్లో మరిన్ని పెట్టుబడులకు కోసం ఉన్న అవకాశాలు, భవిష్యత్తు ప్రణాళికలను చర్చించేందుకు ఇది సమర్థవంతమైన వేదికగా పనిచేస్తోంది. ఇరు దేశాల పెట్టుబడిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కూడా ఈ వేదిక ఉపయోగపడుతోంది.

2026 మేలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ యూఏఈలో పర్యటించడం, 2026 సెప్టెంబర్‌లో అబుదాబి యువరాజు షేక్ ఖలీద్ బిన్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ భారత్‌లో పర్యటించడం వంటి ఉన్నతస్థాయి పరస్పర పర్యటనలు ఇరు దేశాల భాగస్వామ్యానికి వ్యూహాత్మక దిశను అందించాయి. దీంతో భారత్-యూఏఈ ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం కావడానికి మరింత ఊతం లభించింది.

నేటి సమావేశంలో ద్వైపాక్షిక పెట్టుబడులను పెంచే చర్యలు, కొత్తగా అభివృద్ధి చెందుతున్న రంగాల్లో సహకార అవకాశాలను అన్వేషించడం సహా కీలక వాణిజ్య, పెట్టుబడి అంశాలపై చర్చించారు. యూఏఈ-భారత్ ఆర్థిక భాగస్వామ్యం పరిమాణం, వ్యూహాత్మక ప్రాధాన్యత పరంగా నిరంతరం విస్తరిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇరు దేశాల ద్వైపాక్షిక వాణిజ్యం 101.25 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరుకుంది. 2025లో చమురేతర వాణిజ్యం 76.2 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఇది ఇరు దేశాల వాణిజ్య సంబంధాల బలాన్ని, సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ) ప్రభావాన్ని ప్రతిబింబిస్తోంది. 2032 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 200 బిలియన్ అమెరికన్ డాలర్లకు పెంచాలనే ఉమ్మడి లక్ష్యంతో భారత్, యూఏఈలు భవిష్యత్తు ఆర్థిక వృద్ధికి కీలకమైన ఇంధనం, మౌలిక వసతులు, సాంకేతికత, కృత్రిమ మేధ వంటి రంగాల్లో పెట్టుబడుల సహకారాన్ని మరింత విస్తరిస్తున్నాయి.

ఈ సానుకూల పరిస్థితుల నేపథ్యంలో భారత్-యూఏఈ మధ్య పెరుగుతున్న వాణిజ్యాన్ని, ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో సీఈపీఏ, ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందం (బీఐటీ), పన్నులు, పరస్పర న్యాయ సహాయం వంటి అంశాలపై కుదిరిన ఇతర ఒప్పందాలు పోషించిన పాత్రను సహాధ్యక్షులు అభినందిస్తూ ఈ సమావేశాన్ని ప్రారంభించారు. సీఈపీఏకు సంబంధించిన ఉపకమిటీల పనితీరును ఇరు దేశాలు సమీక్షించాయి. అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక పరిస్థితులు సంక్లిష్టంగా మారుతున్న నేపథ్యంలో వాణిజ్యాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలపై చర్చించింది.

గుజరాత్‌లోని ఫుడ్ పార్కు ప్రాజెక్టు సహా పలు ఉమ్మడి పెట్టుబడి ప్రాజెక్టులు, సహకార రంగాల్లో సాధించిన పురోగతిని సంయుక్త టాస్క్‌ఫోర్స్ సమీక్షించింది. 2026 చివరి నాటికి యూఏఈలో ఇన్వెస్ట్ ఇండియా కార్యాలయం కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉందని ఇరు దేశాలు పేర్కొన్నాయి. ఇటీవల ఎమిరేట్స్ ఎన్‌బీడీ భారత్‌లోని ఆర్‌బీఎల్ బ్యాంకులో మెజారిటీ వాటాను సుమారు 3 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేయడం, ఇంటర్నేషనల్ హోల్డింగ్ కంపెనీ (ఐహెచ్‌సీ) భారత్‌లోని సమ్మాన్ క్యాపిటల్‌లో 1 బిలియన్ డాలర్ల పెట్టుబడి, ఒడిశాలో సమగ్ర అల్యూమినియం కాంప్లెక్స్ ఏర్పాటుకు 11.5 బిలియన్ డాలర్ల సంయుక్త పెట్టుబడి ప్రతిపాదన వంటి అంశాలను ఇరు దేశాలు స్వాగతించాయి. భారత్‌లోని గిఫ్ట్ సిటీలో మష్రెక్ బ్యాంకు, ఫస్ట్ అబుదాబి బ్యాంకు (ఎఫ్ఏబీ), అబుదాబి నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ (ఏడీఎన్ఐసీ) శాఖల కార్యాలయాలు విజయవంతంగా ప్రారంభమైన విషయాన్ని కూడా ప్రస్తావించారు. 2026 మేలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ యూఏఈ పర్యటన సందర్భంగా కుదిరిన అవగాహన ఒప్పందాల కింద ఇంధన రంగంలో కొనసాగుతున్న సహకారాన్ని ఇరు దేశాలు సమీక్షించాయి. పరస్పర పెట్టుబడుల విస్తృతి, వైవిధ్యాన్ని పరిశీలిస్తే భారత్-యూఏఈ సంబంధాలు అనేక రంగాల్లో బహుముఖ భాగస్వామ్యంగా కొనసాగుతున్నాయని గుర్తించారు.

యూఏఈ-భారత్ ఆర్థిక భాగస్వామ్యంలో ఆర్థిక రంగంలో సహకారం కీలకమైన అంశంగా కొనసాగుతోంది. యూఏఈ, భారత్ సెంట్రల్ బ్యాంకులు స్థానిక కరెన్సీల్లో లావాదేవీలు, చెల్లింపులు, మెసేజింగ్ వ్యవస్థల అనుసంధానం, సెంట్రల్ బ్యాంకు డిజిటల్ కరెన్సీలకు సంబంధించిన కార్యక్రమాల్లో సాధించిన పురోగతిని సమావేశానికి హాజరైన ఇరు దేశాల ప్రతినిధులు సమీక్షించారు. ఈ కార్యక్రమాల ద్వారా ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులను మరింత సమర్థవంతంగా, అందుబాటులో ఉండేలా, పటిష్టంగా నిర్వహించే సామర్థ్యం ఉందని పేర్కొన్నారు. వీటిని సకాలంలో అమలు చేసేందుకు కలిసికట్టుగా పనిచేయాలని ఇరు దేశాలు అంగీకరించాయి. ఇరు దేశాల మధ్య పరస్పర పెట్టుబడులను పెంచే అవకాశం ఉన్న రంగాలపై ప్రతినిధులు చర్చించారు. ఇందులో ఇంధనం, పరిశ్రమలు, లాజిస్టిక్స్, మౌలిక సదుపాయాలు, సాంకేతికత, కృత్రిమ మేధ, అంతరిక్షం, ఆహార భద్రత, వ్యవసాయ ఆవిష్కరణలు, అంకుర సంస్థలు వంటి రంగాల్లో కలిసి పనిచేసే అవకాశాలను పరిశీలించారు.

ఈ సమావేశంలో అబుదాబి-భారత్ మధ్య పౌర విమానయాన రంగంలో సహకారంపై ఇరు దేశాల నేతలు చర్చించారు. విస్తృత ఆర్థిక సంబంధాలకు మద్దతుగా విమాన రాకపోకలను మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా చర్చలు సాగాయి. భారత్‌లోని గుజరాత్ ధోలేరాలో విమానయాన, లాజిస్టిక్స్ కేంద్రాన్ని అభివృద్ధి చేయడంలో పెట్టుబడి అవకాశాలు, సహకార మార్గాలను ఇరు దేశాలు పరిశీలించాయి.

హెచ్ఎల్‌జేటీఎఫ్ఐ ఏర్పాటైనప్పటి నుంచి భారత్, యూఏఈ మధ్య పెట్టుబడులకు సంబంధించిన సమస్యలను ప్రస్తావించి, వాటిని పరిష్కరించేందుకు బహిరంగంగా, సమర్థవంతంగా పనిచేసే వేదికగా నిరంతరం

భారత్‌లో యూఏఈ పెట్టుబడులు, కంపెనీలకు సంబంధించిన పెండింగ్ సమస్యలను, అలాగే యూఏఈలో భారత పెట్టుబడులు, కంపెనీలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు యూఏఈ-భారత్ ఫాస్ట్ ట్రాక్ వ్యవస్థ ద్వారా చేపట్టిన చర్యలను ఇరు దేశాలు ప్రస్తావించాయి. ఈ సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇరు దేశాలు అంగీకరించాయి.

సమావేశం ముగింపు సందర్భంగా హెచ్ఎల్‌జేటీఎఫ్ఐ విజయవంతంగా కొనసాగేందుకు నిరంతరం కృషి చేస్తున్న ఇరు దేశాల రాయబారులు, అధికారులు, సాంకేతిక బృందాలను సహాధ్యక్షులు అభినందించారు.

హెచ్ఎల్‌జేటీఎఫ్ఐ 14వ సమావేశంపై కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి, హెచ్ఎల్‌జేటీఎఫ్ఐ సంయుక్త అధ్యక్షులు శ్రీ పీయూష్ గోయల్ మాట్లాడుతూ కింది విధంగా పేర్కొన్నారు.

“ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ సమ్మిళిత, సుస్థిర, స్థిరమైన ఆర్థిక వృద్ధికి కట్టుబడి ఉంది. ఈ ప్రయాణంలో యూఏఈ భారత్‌కు విశ్వసనీయ మిత్రదేశం, భాగస్వామి. నేటి జాయింట్ టాస్క్‌ఫోర్స్ సమావేశంలో అనేక కార్యక్రమాల్లో సాధించిన సానుకూల పురోగతిని సమీక్షించడంతో పాటు, భవిష్యత్తులో సహకారాన్ని మరింత విస్తరించే అవకాశాలపై చర్చించాం. పెట్టుబడులు, ఆవిష్కరణల అభివృద్ధి, ప్రజల భద్రత వంటి అంశాల్లో పరస్పర సహకారంతో కొనసాగుతున్న ఈ భాగస్వామ్యం ఇరు దేశాల దూరదృష్టితో కూడిన నాయకత్వంలో గణనీయమైన మార్పు దిశగా ముందుకు సాగుతోంది” అని అన్నారు.

# హైవే దాబాలే టార్గెట్.. గంజాయి విక్రేత అరెస్ట్

కరీంనగర్, సెప్టెంబర్ 29 కరీంనగర్ రూరల్ పోలీసులు గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపారు. ముగ్దుంపూర్ వద్ద మైత్రి ఫ్యామిలీ దాబా సమీపంలో 1 కిలో 140 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని ఒక నిందితుడిని అరెస్ట్ చేశారు.

పోలీసుల వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారంతో ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి, ఎస్సై ఏ. లక్ష్మారెడ్డి సిబ్బందితో కలిసి నిఘా ఏర్పాటు చేశారు. తెల్ల ప్లాస్టిక్ కవర్ తో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పట్టుకుని తనిఖీ చేయగా గంజాయి బయటపడింది.

నిందితుడిని ముగ్దుంపూర్ గ్రామానికి చెందిన బుర్ర వంశీ (24) గా గుర్తించారు. విచారణలో అతను ఒడిశా సరిహద్దుల్లో తక్కువ ధరకు గంజాయి కొని కరీంనగర్ లో యువకులకు, హైవే దాబాల వద్ద లారీ డ్రైవర్లకు చిన్న ప్యాకెట్లుగా విక్రయిస్తున్నట్లు తెలిపాడు. నిందితుడిపై గతంలో పెద్దపల్లి రామగిరి, కరీంనగర్ రూరల్, ఒడిశాలో గంజాయి కేసులు ఉన్నాయని, రూరల్ పీఎస్ లో హిస్టరీ షీట్ ఉందని పోలీసులు తెలిపారు.

నిందితుడి నుంచి గంజాయితో పాటు శాంసంగ్ మొబైల్ స్వాధీనం చేసుకుని రిమాండ్ కు తరలించారు. నిందితుడిని పట్టుకున్న రూరల్ పోలీసులను సీపీ గౌష్ ఆలం, రూరల్ ఏసీపీ విజయ్ కుమార్ అభినందించారు.

# మేడారం అమ్మవార్ల దర్శనానికి విచ్చేసిన ప్యారడైజ్ సినిమా టీమ్

## ది ప్యారడైజ్ మూవీలో క్రెడిట్ అంతా ఐఅఖీ క్యారెక్టర్‌దే..

ములుగు, సెప్టెంబర్ 29:(నేటినిజం ప్రతినిధి): ఈ రోజు ములుగు జిల్లా బి ఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆదేశానుసారం గోవిందరావుపేట మండలం పస్రా గ్రామం నందు ది ప్యారడైజ్ చిత్ర బృందానికి స్వాగతం సుస్వాగతం పలికిన గోవిందరావుపేట బిఆర్ఎస్ పార్టీ నాయకులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ మీడియాతో ది ప్యారడైజ్ సినిమా కంటే అందులో 4 నిమిషాలు మాత్రమే ఉన్న శంకరన్న క్యారెక్టర్‌కు మంచి ప్రాధాన్యం దక్కింది. ఓ రకంగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ పాలన ఉన్నప్పటికీ కేసీఆర్‌ను హీరోగా చూపిస్తూ సినిమా తెరకెక్కించాడని చాలా సంతోషకరమైన విషయం అని వారు గుర్తు చేశారు. చాలా సినిమాలు యదార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కిస్తారు. కొన్ని చిత్రాల్లో నిజంగా జరిగిన సన్నివేశాలు పెట్టడం సహజంగా చూస్తూ ఉంటాం. కాని భారీ బడ్జెట్, ఇండస్ట్రీలో టాప్ స్టార్ కాస్ట్‌ని పాత్రధారులుగా పెట్టి తీసిన సినిమాలో పొలిటికల్ పర్సనాలిటీ పాత్రను సృష్టించి సినిమా తీయడం అంటే అది కత్తి మీద సాములాంటిదే అని చెప్పాలి. ఇండస్ట్రీలో విపరీతమైన బజ్ ఏర్పడి, ఆడియన్స్ ఈగర్లీ వెయిట్ చేసిన మూవీ ది పారడైజ్. నేచురల్ స్టార్ నాని, శ్రీకాంత్ ఓదెల కాంబోలో వచ్చిన ఈ సినిమా హిట్టు ది ప్యారడైజ్ సినిమాలో మాత్రం మాజీ సీఎం, తెలంగాణ సాధకుడు, బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌ని హీరోగా చూపించే కల్పిత పాత్రను పెట్టడం ఇటు తెలంగాణలో బి ఆర్ఎస్ పార్టీకి కొంత మైలేజ్ తీసుకొచ్చిందని చెప్పొచ్చు . కేసీఆర్‌ని హీరోగా చూపించే సినిమాని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు సృష్టించిన తెలంగాణ ఉన్నంత వరకు కేసీఆర్ పేరుని ఎవరూ చెరిపేయలేరంటూ అనే విషయం మరొకసారి గుర్తు చేస్తున్నామని అన్నారు. ఈనెల 24న వరల్డ్ వైడ్‌గా రిలీజైన సినిమా హిట్ సొంతం చేసుకుంది, ఈ సినిమా మాత్రం కంప్లీట్ తెలంగాణలో జాగీర్ జమానాని హైలెట్ చేస్తూ తయారు చేసుకున్నాడు శ్రీకాంత్ ఓదెల. ఇక ఈసినిమాలో 1980-85 బ్యాక్ డ్రాప్‌లో సాగిన కథలో తెలంగాణ మాస్ లీడర్, మాజీ సీఎం, బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ పాత్రను పోలిన శంకరన్న పాత్రలో యాజిటీజ్‌గా కేసీఆర్ మాటలు, వ్యవహారంతో పాటు తెలంగాణ సాధనకు ముందు చేసిన వాగ్దానం వంటి వాటిని నటుడు ప్రియదర్శినితో చెప్పించాడు దర్శకుడు. ఇది సినిమాలో ఓ కీ పాయింట్ మాత్రమే అనుకుంటే ఇప్పుడు థియేటర్లలో కేసీఆర్ పాత్రకు ఊహించని రెస్పాన్స్ వస్తోంది తెలంగాణలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు సంతోషించవలసిన విషయమని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు . సోషల్ మీడియాలో కేసీఆర్ జపం మొదలైంది..సినిమాలో శంకరన్న పాత్రలో ప్రియదర్శిని గెటప్ వాస్తవంగా కేసీఆర్ క్యారెక్టర్‌కి దగ్గరగా ఉండటంతో రిలీజ్ రోజు నుంచే మొదలైపోయింది. కేసీఆర్ నిజంగా హీరోనే అంటూ నువ్వు వెయ్యి జన్మలెత్తినా కేసీఆర్ ఆనవాళ్లు చెరిపెయ్యలేవ్ రేవంత్ రెడ్డి.క్రెడిట్ అంతా కేసీఆర్ పాత్రకే అంతా శంకరన్న పాత్రకే దక్కుతోంది.. నాని చిత్రబృందానికి స్వాగతం పలికిన వారిలో మాజీ మండల అధ్యక్షుడు లకావత్ నరసింహా నాయక్, మాజీ రైతుబంధు కోఆర్డినేటర్ పిన్నింటి మధుసూదన్ రెడ్డి మాజీ ఎంపీటీసీ చందులాల్ సర్పంచ్ గాంధీ, గోవిందరావుపేట సోషల్ మీడియా మండల కన్వీనర్ పృథ్వీరాజ్ ఉట్ల, లవ్డియ రామచందర్ మాజీ ఎంపీటీసీ,పస్రా మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు తాటికొండ శ్రీనివాస చారి,సర్పంచ్ ఘోరం మాజీ మండల అధ్యక్షులు మోహన్ రాథోడ్, అజ్మీర సురేష్ గోవిందరావుపేట ఉద్యమకారుల సంఘం అధ్యక్షులు, లౌడియా వాగా సీనియర్ నాయకులు, సోషల్ మీడియా అజిత్. గోవిందరావుపేట యూత్ అధ్యక్షులు జన్ను రాంబాబు, మడికొండ రమేష్, కత్తుల సారయ్య వార్డ్ నెంబర్,ధరావతు పూర్ణచందర్, గజ్జి ఎలేందర్, ఎం వెంకన్న జల్లాల కొమురయ్య, ధనుంజయ పసర వార్డ్ నెంబర్, కొండ సత్యనారాయణ, ఏంపెల్లి శ్రీను, కుమారి తదితరులు.

# భారత్-ఫ్రాన్స్ మధ్య విస్తృత శాస్త్ర-సాంకేతిక సహకారానికి ఆవిష్కరణల సంవత్సరం-2026 కొత్త బాటలు వేస్తుంది: డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29: భారత్- ఫ్రాన్స్ మధ్య 1960 దశకం నాటి తొలి సౌండింగ్ రాకెట్ నుంచి నేటి అత్యాధునిక ప్రయోగాల దాకా అంతరిక్ష రంగ సహకారం అవిచ్ఛిన్నంగా కొనసాగుతోంది. ఈ మేరకు కేంద్ర శాస్త్ర-సాంకేతిక-భూ విజ్ఞాన (స్వతంత్ర బాధ్యత), సిబ్బంది-ప్రజా సమస్యలు-పింఛన్లు, అణుశక్తి-అంతరిక్ష శాఖలు, ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ రోజు న్యూఢిల్లీలో వ్యాఖ్యానించారు. రెండు దేశాల మధ్య సంయుక్త ఉపగ్రహ ప్రయోగాలు, ప్రయోగ వాహన సాంకేతికతలు, మానవ అంతరిక్ష యానం, ఆధునిక అంతరిక్ష అనువర్తనాలలో ఈ విస్తృత, విస్తరిత భాగస్వామ్యం పరిణామం చెందిందని ఆయన పేర్కొన్నారు.

నేడు వేగంగా విస్తరిస్తున్న అంతరిక్ష రంగంలో మరింత విస్తృత భాగస్వామ్యం సహా ప్రభుత్వాలు-పరిశోధన సంస్థలు, పరిశ్రమలు-అంకురాలను ఒకే వేదికపైకి తెచ్చి, భారీ నవ్యావరణ వ్యవస్థ రూపకల్పనకు రెండు దేశాల మధ్యగల ఈ సుదీర్ఘ బంధం ఒక అవకాశం కల్పిస్తోందని మంత్రి చెప్పారు.

ఫ్రాన్స్ ఉన్నత విద్య- పరిశోధన-అంతరిక్ష శాఖ మంత్రి ప్రొఫెసర్ ఫిలిప్ బాప్టిస్ట్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం న్యూఢిల్లీలో డాక్టర్ జితేంద్ర సింగ్‌తో ఇవాళ సమావేశమైంది. అంతరిక్ష రంగంపై శిఖరాగ్ర సదస్సు, భారత్-ఫ్రాన్స్ ఆవిష్కరణల సంవత్సరం-2026, అంతరిక్షం, సెఫిప్రా, నీలి ఆర్థిక వ్యవస్థ సహా శాస్త్ర-సాంకేతిక సహకారంపై ప్రాథమ్యాల మీద ఈ సందర్భంగా చర్చించారు. వివిధ రంగాలలో రెండు దేశాల మధ్య సహకార విస్తృతిని ఈ భారీ ప్రతినిధి బృందం ప్రతిబింబిస్తున్నదని డాక్టర్ జితేంద్ర సింగ్ వ్యాఖ్యానించారు.

ఈ సమావేశంలో మంత్రితోపాటు శాస్త్ర-సాంకేతిక విభాగం కార్యదర్శి ప్రొఫెసర్ ఉమేష్ వి.వాఘ్మారే, భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ టి.శ్రీనివాస కుమార్, బయోటెక్నాలజీ విభాగం కార్యదర్శి డాక్టర్ రాజేష్ ఎస్.గోఖలే, సీఎస్ఐఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ శ్రీమతి ఎన్.కలైసెల్వి, డీఎస్టీ అంతర్జాతీయ సహకార విభాగాధిపతి డాక్టర్ ప్రవీణ్ కుమార్ సోమసుందరం, అంతరిక్ష విభాగం, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధులు, సెఫిప్రా డైరెక్టర్-ఫ్రాన్స్ నోడల్ అధికారి-శాస్త్రవేత్త(ఇ) ఐసీడీ, డీఎస్టీ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రాన్స్ ప్రతినిధి బృందంలో- మంత్రి ప్రొఫెసర్ ఫిలిప్ బాప్టిస్ట్, చీఫ్ ఆఫ్ స్టాఫ్ లూ లే నబాస్క్, దౌత్య సలహాదారు అలెక్సియా లకాజ్, వ్యక్తిగత భద్రతా అధికారి జెరెమీ రోలర్, ఇండియా డెస్క్ అధికారి బెనోయిట్ టాల్యూ ఉన్నారు. అలాగే, ఎసెక్ డైరెక్టర్ జనరల్ విన్సెంజో విన్జీ, భారత్‌లో ఫ్రాన్స్ రాయబారి థియరీ మాథౌ, సహకార-సాంస్కృతిక కార్యాచరణ కౌన్సిలర్ గ్రెగోర్ ట్రుమెల్, డిప్యూటీ కౌన్సిలర్ నికోలస్ గాస్కోయిన్, శాస్త్రీయ సహకార అధికారి సిల్వియన్ వీడ్, వ్యూహాత్మక వ్యవహారాల సలహాదారు రాఫెల్ సనానెస్, అంతరిక్ష వ్యవహారాల కౌన్సిలర్ తమారా టెజెల్ కూడా చర్చల్లో పాలుపంచుకున్నారు.

రెండు దేశాల అంతరిక్ష సంస్థలు పునాదులు ఎంత లోతైనవో భారత్-ఫ్రాన్స్ అంతరిక్ష సహకారం కూడా అంత విస్తృతమైనదని డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఈ భాగస్వామ్యం 1960లలో సౌండింగ్ రాకెట్ ప్రయోగాల నుంచి నేటి మానవ అంతరిక్ష యాత్ర సహకారం దాకా పురోగమించిందని ఆయన గుర్తుచేశారు. ఇస్రో, సిఎన్ఇఎస్ సంయుక్తంగా రూపొందించిన మేఘా-ట్రోపిక్స్, సరళ్, ప్రయోగ వాహన ఇంజిన్ తదితరాల్లో సహకారం ఈ సుదీర్ఘ భాగస్వామ్యంలో కీలక ఘట్టాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మూడో సంయుక్త ఉపగ్రహం ‘తృష్ణ’ దిశగా కార్యక్రమాల ప్రగతి సంతృప్తకరంగా ఉందని చెప్పారు. వినియోగ వస్తు సరఫరా, ఫ్లైట్ సర్జన్లకు శిక్షణ సహా భారత గగన్‌యాన్ కార్యక్రమానికి ‘సిఎన్ఇఎస్’ మద్దతివ్వడాన్ని ఆయన అభినందించారు. మానవ అంతరిక్ష యాత్ర సంబంధిత సూక్ష్మ గురుత్వాకర్షణ పరిశోధన, పారబోలిక్ విమానాల అంశంపైనా ద్వైపాక్షిక చర్చలు ప్రారంభించారు.

భారత అంతరిక్ష రంగ రూపాంతరీకరణ నేపథ్యంలో ప్రభుత్వ సంస్థలు-పేరొందిన సంస్థలకు అతీతంగా సహకార విస్తరణకు రెండు దేశాల మధ్య కొత్త అవకాశాలు అందివస్తున్నాయని మంత్రి అన్నారు. భారత అంతరిక్ష రంగ సంస్కరణలు, ప్రైవేట్ వ్యవస్థల వృద్ధిని ప్రస్తావిస్తూ- దేశంలో ప్రస్తుతం 400కు పైగా అంతరిక్ష అంకుర సంస్థలు రాకెట్-ఉపగ్రహ నిర్మాణం, అంతరిక్ష అనువర్తనాలు సహా వివిధ రంగాలలో కృషి చేస్తున్నాయని ఆయన అన్నారు. రెండు దేశాల ప్రభుత్వ సంస్థలు, పరిశ్రమలు, అంకుర సంస్థలను భారత్-ఫ్రాన్స్ సహకారంలో తదుపరి దశ ఒకే వేదికపైకి తెస్తుందని తెలిపారు. తద్వారా ఒక భారీ నవ్యావరణం రూపొందడమే కాకుండా విస్తృత వనరుల సముదాయ సృష్టి సాధ్యం కాగలదని ఆయన చెప్పారు.

ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ‘భారత్-ఫ్రాన్స్ ఆవిష్కరణల సంవత్సరం-2026’ కు శ్రీకారం చుట్టడాన్ని డాక్టర్ జితేంద్ర సింగ్ గుర్తుచేశారు. దీనివల్ల ఆవిష్కరణలు, అత్యాధునిక సాంకేతికతలలో భాగస్వామ్య విస్తృతికి కీలక వేదిక ఏర్పడుతుందని చెప్పారు. ఈ ఏడాది అక్టోబరు 11న బెంగళూరులో నిర్వహించే ‘వాటర్ సైకిల్, తృష్ణ మిషన్’ కార్యక్రమాల గురించి ఆయన ప్రస్తావించారు. ఇందుకోసం ఇస్రో ప్రచార సామగ్రిని సమకూరుస్తుండగా, సీనియర్ అధికారులు తృష్ణ ఉపగ్రహం, దాని అనువర్తనాలపై ప్రసంగిస్తారని వెల్లడించారు.


బయోటెక్నాలజీ, డిజిటల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీస్, సముద్ర శాస్త్రాలు సహా రెండు దేశాల శాస్త్రీయ సహకార విస్తృతి నేపథ్యంలో అంతరిక్ష భాగస్వామ్యం ప్రాధాన్యాన్ని మంత్రి గుర్తుచేశారు. సిఫిప్రా, భారత్-ఫ్రాన్స్ సంయుక్త కేంద్రాల వంటి సంస్థలు- యంత్రాంగాల ద్వారా కొనసాగుతున్న కృషి- బహుళ విజ్ఞానశాస్త్ర రంగాల్లో నిరంతరం విస్తరిస్తున్న భాగ స్వామ్యంగా రూపుదిద్దుకుంటోందని ఆయన తెలిపారు.

నీలి ఆర్థిక వ్యవస్థను ప్రస్తావిస్తూ- సముద్ర శాస్త్ర విజ్ఞానంలో సహకారానికి గల అవకాశాలు సహా సముద్రపు లోతుల్లోని అపార శాస్త్రీయ, వనరుల సామర్థ్యాన్వేషణలో భారత ‘డీప్ ఓషన్ మిషన్’కు ఎంతో ప్రాధాన్యం ఉందని డాక్టర్ జితేంద్ర సింగ్ చెప్పారు. అంతరిక్ష, శాస్త్రవిజ్ఞాన, సముద్ర రంగాలలో విస్తరిస్తున్న కృషి ఫలితంగా ఈ వ్యవస్థలోని సంస్థలు-వాటాదారుల మధ్య పెరుగుతున్న సహకారం భారత్-ఫ్రాన్స్ విస్తృత భాగస్వామ్య రూపకల్పనకు ఒక అవకాశాన్నిస్తుందని ఆయన అన్నారు.

ప్రొఫెసర్ ఫిలిప్ బాప్టిస్ట్ మాట్లాడుతూ- శాస్త్ర, సాంకేతిక, అంతరిక్ష రంగాలలో భాగస్వామ్యాన్ని మరింత విస్తృతం చేసుకోవాలన్న భారత్ దృక్కోణంతో ఫ్రాన్స్ ఏకీభవిస్తున్నదని చెప్పారు. తదనుగుణంగా ఆయా రంగాల్లో సహకారా విస్తరణకు తామెంతో ఆసక్తితో ఉన్నామని ఆయన పేర్కొన్నారు. రెండు దేశాల సమష్టి సామర్థ్యం ఎంతటి విజయం సాధించగలదో చెప్పడానికి ‘తృష్ణ’ను ఒక బలమైన ఉదాహరణగా ఆయన అభివర్ణించారు. మానవ అంతరిక్ష యానం, వ్యోమగాముల ఆరోగ్యం, సూక్ష్మ గురుత్వాకర్షణపై పరిశోధన, పారబోలిక్ విమానాలు వంటి అంశాల్లో మరింత సహకారంపై హర్షం వ్యక్తం చేశారు. బలమైన, భవిష్యదాధారిత భారత్-ఫ్రాన్స్ ఆవిష్కరణల వ్యవస్థ రూపకల్పనపై సమష్టి లక్ష్యాన్ని ఆయన ప్రస్తావించారు. అలాగే, రెండు దేశాల పరిశోధన సంస్థలను, అంకుర సంస్థలను అనుసంధానించడంపైనా ఆయన సానుకూలత వెలిబుచ్చారు.

ఈ ఏడాది (2026)ని భారత్-ఫ్రాన్స్ ఆవిష్కరణల సంవత్సరంగా పాటిస్తున్న కీలక తరుణంలో రెండు దేశాల మధ్య ఈ సమావేశం నిర్వహించడం గమనార్హం. అంతరిక్షం, సైన్స్ అండ్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ, డిజిటల్ సైన్సెస్, సముద్ర శాస్త్ర రంగాలలో ద్వైపాక్షిక సహకారం కొనసాగుతున్న నేపథ్యంలో ఈ దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని ఆధునిక రంగాల్లోకి మరింత విస్తరించేలా ఈ చర్చలు నవ్యోత్తేజమిచ్చాయి. అదే సమయంలో సంస్థాగత, పారిశ్రామిక, అంకుర సంస్థల మధ్య సహకారానికి మరిన్ని అనువైన అవకాశాలకు బాటలు వేశాయి.

# గ్రీన్‌ఫీల్డ్ హైవేపై వేగం.. వరుస ప్రమాదాలు




ఖమ్మం, సెప్టెంబర్ 29:ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేపై వేగ నియంత్రణ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పలువురు ప్రాణాలు కోల్పోతుండటంతో వాహనదారులు, ప్రయాణికుల్లో ఆందోళన నెలకొంది. రహదారిపై వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

-ఖమ్మం నుంచి రాజమండ్రి వరకు సుమారు 250 కిలోమీటర్ల మేర ఉన్న ఈ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రహదారి వెడల్పు, వేగ నియంత్రణకు సంబంధించి తగిన చర్యలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు అంటున్నారు.

ఈ నెలలోనే ఒకేరోజు మూడు ప్రమాదాలు జరిగి ముగ్గురు మృతి చెందడంతో ఆందోళన మరింత పెరిగింది. సోమవారం గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును లారీ ఢీకొనడంతో పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ఘటనతో హైవేపై భద్రతా చర్యలపై మరోసారి చర్చ మొదలైంది.

ఈ రహదారిపై వాహనాలు గంటకు 100 కిలోమీటర్లకు మించిన వేగంతో ప్రయాణించకూడదని అధికారులు సూచించినప్పటికీ, కొందరు వాహనదారులు నిబంధనలు పాటించడం లేదని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా ఓవర్‌టేక్ చేసే సమయంలో వేగాన్ని అదుపు చేయకపోవడం, రహదారి సౌకర్యంగా ఉందనే భావనతో అధిక వేగంతో ప్రయాణించడం ప్రమాదాలకు కారణమవుతున్నట్లు పేర్కొంటున్నారు.గతంలోనూ ఈ రహదారిపై 10 నుంచి 15 వరకు ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయినట్లు స్థానికులు తెలిపారు. వేగ నియంత్రణకు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.హైవేలోని కొన్ని ప్రాంతాల్లో 50 నుంచి 100 మీటర్ల దూరానికి ఒకటి చొప్పున సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. రహదారిపై తగినంత వెలుతురు ఉండేలా మరిన్ని లైట్లు ఏర్పాటు చేస్తే రాత్రివేళల్లో వాహనదారులకు రహదారి స్పష్టంగా కనిపించే అవకాశం ఉంటుందని అంటున్నారు.గత నెలలో గ్రీన్‌ఫీల్డ్ హైవేను ఢిల్లీ నుంచి వచ్చిన అధికారుల బృందం పరిశీలించినట్లు సమాచారం. ప్రమాదాలకు ప్రధాన కారణాల్లో వేగ నియంత్రణ లేకపోవడం ఒకటిగా గుర్తించినట్లు, రహదారిని ఆరు లేన్లుగా విస్తరించే ప్రతిపాదనపై కూడా పరిశీలన జరిగినట్లు తెలిసింది.హైవేపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వేగ నియంత్రణ చర్యలు, అవసరమైన లైటింగ్, ఇతర భద్రతా ఏర్పాట్లు చేపట్టి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### 2 లక్షల కన్న ఎక్కువ మందితో స్వచ్ఛత, సాంస్కృతిక జాగృతి

# ప్రజల భాగస్వామ్య సందేశాన్ని దేశవ్యాప్తంగా తీసుకెళ్లిన సేవా హీ సంస్కృతి



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29' సేవా సంకల్ప్ అభియా న్-2026'లో ఓ ముఖ్య భాగంగా 'సేవా హీ సంస్కృతి' కార్యక్రమాన్ని సాంస్కృతిక మంత్రిత్వశాఖ ఈ నెల 17 నుంచి 24 వరకు దేశవ్యాప్తంగా నిర్వహించింది. సేవ, స్వచ్ఛత, సాంస్కృతిక జాగృతి, దేశ నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం వంటి భావనలను ప్రోత్సహించడం ప్రధానోద్దేశంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

'సేవా హీ సంస్కృతి' కార్యక్రమంలో భాగంగా 'వారసత్వం, అభివృద్ధి', 'స్వచ్ఛతతో జతపడిన ఒక కొత్త కథ' వంటి విషయాల ఆధారంగా అనేక కార్యకలాపాలను నిర్వహించారు. వీటిలో వీధి నాటికలు, కళా ప్రదర్శనలు, ముగ్గులు వేయడం, సామూహిక గానం వంటివి ఉన్నాయి. వీటి ద్వారా స్వచ్ఛత పరిరక్షణ, సామాజిక బాధ్యత అన్న సందేశాలను ప్రజల చెంతకు చేరవేశారు. దీంతో పాటు భారతదేశ సంస్కృతి, విలువలు, నైతిక సిద్ధాంతాలు, దేశ సాంస్కృతిక వారసత్వ రక్షణకు ప్రాధాన్యాన్ని ఇవ్వాల్సి ఉందన్న అవగాహనను కల్పించారు.

ఈ కార్యక్రమానికి మద్దతును అందించిన సంస్థల్లో సంగీత నాటక అకాడమీ, లలిత కళా అకాడమీ, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్ఎస్‌డీ) తో పాటు దేశంలోని ఏడు జోనల్ సాంస్కృతిక కేంద్రాలైన నార్త్ జోన్ కల్చరల్ సెంటర్ (ఎన్‌జడ్‌సీసీ), నార్త్ ఈస్ట్ జోన్ కల్చరల్ సెంటర్ (ఎన్ఈజడ్‌సీసీ), ఈస్ట్ జోన్ కల్చరల్ సెంటర్ (ఈజడ్‌సీసీ), వెస్ట్ జోన్ కల్చరల్ సెంటర్ (డబ్ల్యూజడ్‌సీసీ), సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ (ఎస్‌జడ్‌సీసీ), సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్ (ఎస్‌సీజడ్‌సీసీ), నార్త్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్ (ఎన్‌సీజడ్‌సీసీ) ఉన్నాయి.

ఈ ప్రచార ఉద్యమంలో భాగంగా, దేశంలో వివిధ ప్రాంతాల్లో 270కి పైగా కార్యక్రమాలను నిర్వహించారు. వీటిలో వీధి నాటికలు, ముగ్గులు వేయడం, స్వచ్ఛత పరిరక్షణ, అంతా కలిసికట్టుగా 'వందే మాతరం' ఆలపించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో 2 లక్షల మందికి పైగా పాల్గొన్నారు.

ఉమ్మడి భాగస్వామ్యం ద్వారా స్వచ్ఛత, సాంస్కృతిక స్థలాల రక్షణను ధ్యేయంగా ఎంచుకొని 'సేవా హీ సంస్కృతి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయ భవన సముదాయాల్లోనూ, సాంస్కృతిక ప్రదేశాలు, వాటి చుట్టుపక్కల ప్రాంతాల్లో స్వచ్ఛత పరిరక్షణ కార్యక్రమాలే కాక వివిధ వారసత్వ ప్రదేశాలలో స్వచ్ఛత ఉద్యమంలో పాలుపం చుకొనేటట్లుగా ప్రజలను ప్రోత్సహించారు.

ప్రజలు తప్పక ప్రభావితం అయ్యే రీతిలో వీధి నాటికలు, భారత సాంస్కృతిక విజయాలను ప్రస్తావించే కథలు, వివిధ కార్యక్రమాలను ప్రదర్శించారు. కళను, సంస్కృతిని, ప్రజల భాగస్వామ్యాన్ని ఏకతాటి మీదకు తీసుకురావడం ద్వారా సామాజిక బాధ్యత భావనను ప్రోత్సహించేలా చూడడం ఈ కార్యక్రమ లక్ష్యం. ప్రత్యేకించి యువతలోనూ, విద్యార్థుల్లోనూ దేశ నిర్మాణం పట్ల సేవ, నిబద్ధత భావాలను బలోపేతం చేయడం ఈ కార్యక్రమ ధ్యేయం.

ఈ కార్యక్రమాలను ప్రభుత్వ కార్యాలయ భవన సముదాయాలు, పాఠశాలలు, కళాశాలలు, పార్కులు, బజార్లు, దేవాలయాలు, ఘాట్లతో పాటు ఇతర బహిరంగ స్థలాల్లో నిర్వహించారు.

సేవ, స్వచ్ఛత, సంస్కృతిల విలువలను 'సేవా హీ సంస్కృతి' కార్యక్రమం ప్రస్ఫుటం చేసింది. దేశానికి సేవలను అందించడంలో భారత సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడం, బహిరంగ స్థలాలను శుభ్రంగా ఉంచడం కూడా ప్రాధాన్య అంశమేననే సందేశాన్ని ఈ కార్యక్రమం చాటింది.

## మానసిక వికలాంగుల కేంద్రంలో అన్నదానం

ఖమ్మం, సెప్టెంబర్ 29: వైరా అవని మహిళా క్లబ్ ఆధ్వర్యంలో బోనకల్‌లో ఉన్న మానసిక వికలాంగుల కేంద్రంలో అవని సభ్యురాలు ప్రసన్నకుమార్తె పుట్టినరోజు పురస్కరించుకొని రెండవ రోజు వికలాంగుల కేంద్రంలో 50 మంది మానసిక వికలాంగులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మానసిక వికలాంగుల సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ.. వైరా లయన్స్ క్లబ్బుల ఆధ్వర్యంలో చాలాసార్లు అన్నదాన కార్యక్రమం చేపట్టారని వారు గుర్తు చేశారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్బుల నిర్వాహకులను అభినందించారు ఈ సందర్భంగా అవనీ క్లబ్ అధ్యక్షురాలు గద్దె నీరజ సెక్రటరీ సుగ్గల మాధవి మాట్లాడుతూ.. అవని క్లబ్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు పది సేవా కార్యక్రమాలు నిర్వహి ంచామని వృద్ధులను మానసిక వికలాంగులను ఆదుకోవ డం లోనే మానసిక సంతృప్తి ఉంటుం దన్నారు. కార్యక్రమంలో అవని క్లబ్ కోశాధికారి కొదుమూరి భాగ్యలక్ష్మి సభ్యులు నాళ్ళ నాగమల్లేశ్వరి, అరుణ, రాజ్యల క్ష్మి, నిర్మల, విజయరత్న, కుమారి, చెరుకుపల్లి వెంకటేశ్వ రరావు, చెరుకూరి శ్రీనివాసం రావు, ఆశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు

## దేశవ్యాప్త బంగారం అక్రమ రవాణా వ్యవస్థను ఛేదించిన డీఆర్ఐ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29వ్యవస్థీకృత బంగారం అక్రమ రవాణాపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా దేశవ్యాప్తంగా బంగారం స్మగ్లింగ్ చేసే ముఠా గుట్టు రట్టు చేసింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా దాదాపు రూ. 10.36 కోట్ల విలువైన 6.61 కేజీల విదేశీ అక్రమ బంగారాన్ని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఈ ముఠా కొరియర్ వ్యవస్థ ద్వారా కార్యకలాపాలు సాగిస్తూ... గడిచిన తొమ్మిది నెలల్లో దాదాపు రూ. 475 కోట్ల విలువైన 318 కిలోల స్మగ్లింగ్ బంగారాన్ని దేశవ్యాప్తంగా రవాణా చేసింది. ఈ వ్యవహారంలో కీలక సూత్రధారితో సహా మొత్తం 11 మందిని అధికారులు అరెస్టు చేశారు.

పశ్చిమ బెంగాల్, అస్సాంలోని ఇండో-బంగ్లాదేశ్ సరిహద్దుల ద్వారా విదేశీ బంగారం నిరంతరం అక్రమ రవాణా అవుతోందని, ఆ తర్వాత కొరియర్ పార్సిళ్ల ద్వారా దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలిసున్నారని లభించిన ఖచ్చితమైన సమాచారంతో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) సెప్టెంబర్ 23, 24 తేదీల్లో అనేక నగరాల్లో ఒకేసారి దాడులు నిర్వహించింది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, అహ్మదాబాద్, గువాహటి ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలను అడ్డుకొని సోదాలు నిర్వహించారు. ఈ ఆపరేషన్ సమయంలో గువాహటి, కోల్‌కతా నుంచి ముంబై, ఢిల్లీ, అహ్మదాబాద్‌లకు డెలివరీ కోసం బుక్ చేసిన స్మగ్లింగ్ బంగారంతో కూడిన లైవ్ కొరియర్ సరుకులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ పార్సిళ్లను తీసుకోవడానికి వచ్చిన ఏడుగురిని అదుపులోకి తీసుకోగా, కోల్‌కతాలోని కొరియర్ పంపినవారి ప్రాంగణాల్లో జరిపిన తనిఖీల్లో మరో ముగ్గురిని అరెస్టు చేశారు. తదుపరి చేపట్టిన చర్యల్లో ఈ బంగారాన్ని పంపించి, డెలివరీ చేయడంలో సమన్వయం చేసిన వ్యక్తుల్లో కీలక సూత్రధారిని ముంబైలో అరెస్టు చేశారు.

ఈ స్మగ్లింగ్ ముఠా విదేశాల నుంచి అక్రమంగా తీసుకొచ్చిన బంగారాన్ని చిన్న చిన్న కొరియర్ పార్సిళ్లుగా విభజిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. గువాహటి, కోల్‌కతాల నుంచి ముంబై, ఢిల్లీ, అహ్మదాబాద్‌లలోని వివిధ వ్యక్తులకు ఈ పార్సిళ్లను పంపి, స్థానిక మార్కెట్‌లో విక్రయించేవారు. బంగారం పంపినవారు, అందుకున్నవారు ఇద్దరూ ఎటువంటి చట్టబద్ధమైన బంగారు లావాదేవీలు లేకుండా కేవలం కాగితాలకే పరిమితమైన వ్యక్తులుగా గుర్తించారు. బంగారాన్ని రహస్యంగా రవాణా చేయడానికి, పంపిణీ చేయడానికి వారు కావాలనే ఈ కొరియర్ వ్యవస్థను ఉద్దేశపూర్వకంగా ఉపయోగించారని తేలింది.

అడ్డుకున్న పార్సిళ్ల నుంచి సుమారు రూ. 10.36 కోట్ల విలువైన కడ్డీల రూపంలో ఉన్న మొత్తం 6.61 కిలోల విదేశీ బంగారాన్ని స్వాధీనం చేసుకుని, కస్టమ్స్ చట్టం 1962 నిబంధనల ప్రకారం జప్తు చేశారు. ఈ సిండికేట్‌తో సంబంధం ఉన్న 11 మందిని అరెస్టు చేశారు.

సేకరించిన పత్రాల ప్రాథమిక విచారణలో ఈ ముఠా అక్రమ కార్యకలాపాలు భారీ స్థాయిలో చేపట్టినట్లు బయటపడింది. కేవలం గడిచిన 9 నెలల్లోనే సుమారు రూ. 475 కోట్ల విలువైన 318 కిలోల స్మగ్లింగ్ బంగారాన్ని ఇదే కొరియర్ వ్యవస్థ ద్వారా దేశవ్యాప్తంగా చేరవేసినట్లు తేలింది. ఈ వ్యవహారంపై మరింత లోతైన విచారణ కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా స్మగ్లింగ్ బంగారాన్ని రవాణా చేయడానికి అసాధారణమైన కొరియర్, లాజిస్టిక్స్ మార్గాలను ఉపయోగించడంతోపాటు, సరఫరా వ్యవస్థలోని ప్రతి దశలోనూ వ్యవస్థీకృత బంగారం అక్రమ రవాణా వ్యవస్థలను ఛేదించడంపై డీఆర్ఐ నిరంతరం చూపుతున్న ప్రత్యేక దృష్టికి ఈ ఆపరేషన్ ఒక నిదర్శనంగా నిలిచింది.

# పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదు చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు.



ములుగు, సెప్టెంబర్ 29:(నేటినిజం ప్రతినిధి): జిల్లాలో పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు.

మంగళవారం ములుగు జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వరంగల్- ఖమ్మం- నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా లో పట్టభద్రులైన ఓటర్లు ఓటరుగా నమోదు చేసుకోవడంపై గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.

వరంగల్- ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం వెలువరించిన నియమ నిబంధనలు, దరఖాస్తు చేసే విధానం, గడువు, తదితర వివరాలను జిల్లా కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు అర్హులైన గ్రాడ్యుయేట్లు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవడంపై అవగాహన కల్పించాలన్నారు. కొత్తగా ఓటరు గా నమోదు కోసం గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన వారు ఫారం 18 ద్వారా అన్ని వివరాలను నింపి గెజిటెడ్ అధికారి లేదా డిసిగ్నేటెడ్ అధికారి ద్వారా సంతకం చేసిన ధ్రువపత్రాన్ని సంబంధిత అధికారులకు సమర్పించాలన్నారు. 01/11/2023కంటే ముందు పట్టభద్రులైన వారు, ఈ ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలో స్థానిక నివాసులై ఉన్నవారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు.

అర్హులైన పట్టభద్రులు తమ సంబంధిత మండల తహసీల్దార్లు, సహాయ ఓటరు నమోదు అధికారులు (ఎఇఆర్ఓ) మరియు నియమిత అధికారులను సంప్రదించి దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. దరఖాస్తుతో పాటు విద్యార్హతకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, అవసరమైన ఇతర పత్రాలను జతచేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్ https://ceotelangana.nic.in/](https://ceotelangana.nic.in/) ను సందర్శించవచ్చని తెలిపారు.

పట్టభద్రుల ఓటరు జాబితాల నూతన తయారీ ప్రక్రియలో భాగంగా, ఇప్పటికే ఓటరు జాబితాలో పేర్లు ఉన్నవారు సైతం నిర్దేశిత విధానం ప్రకారం తిరిగి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పాత ఓటరు జాబితాలో పేరు ఉండటం ఒక్కటే ప్రస్తుత ప్రక్రియలో నమోదుకు సరిపోదని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు నిర్ణీత విధానంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులు పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, అర్హులైన పట్టభద్రులు నిర్ణీత గడువులోగా ఫారం-18 దరఖాస్తులు సమర్పించేలా సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి కోరారు. ఓటరు జాబితాల తయారీ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ సమావేశంలో డిస్ట్రిక్ట్ రెవిన్యూ ఆఫీసర్ వి. రవి కుమార్, ఎలక్షన్ సెల్ డిటిలు నితీష్, గణపతి, సతీష్ వివిధ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మానసిక వికలాంగుల కేంద్రంలో అన్నదానం

ఖమ్మం, సెప్టెంబర్ 29: వైరా అవని మహిళా క్లబ్ ఆధ్వర్యంలో బోనకల్‌లో ఉన్న మానసిక వికలాంగుల కేంద్రంలో అవని సభ్యురాలు ప్రసన్నకుమార్తె పుట్టినరోజు పురస్కరించుకొని రెండవ రోజు వికలాంగుల కేంద్రంలో 50 మంది మానసిక వికలాంగులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మానసిక వికలాంగుల సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ.. వైరా లయన్స్ క్లబ్బుల ఆధ్వర్యంలో చాలాసార్లు అన్న దాన కార్యక్రమం చేపట్టారని వా రు గుర్తు చేశారు. సేవా కార్య క్రమాలు నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్బుల నిర్వాహకులను అభినం దించారు ఈ సందర్భంగా అవనీ క్లబ్ అధ్యక్షురాలు గద్దె నీరజ సెక్రటరీ సుగ్గల మాధవి మాట్లా డుతూ.. అవని క్లబ్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు పది సేవా కార్యక్ర మాలు నిర్వహించామని వృద్ధుల ను మానసిక వికలాంగులను ఆదుకోవడంలోనే మానసిక సంతృప్తి ఉంటుందన్నారు. కార్య క్రమంలో అవని క్లబ్ కోశాధికారి కొదుమూరి భాగ్యలక్ష్మి సభ్యులు నాళ్ళ నాగమల్లేశ్వరి, అరుణ, రాజ్యలక్ష్మి, నిర్మల, విజయరత్న, పాల్గొన్నారు

# ఫ్రాన్స్ ఉన్నత విద్యా శాఖ మంత్రితో న్యూఢిల్లీలో ద్వైపాక్షిక సమావేశాన్ని నిర్వహించిన కేంద్ర విద్యా శాఖ మంత్రి




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29ఫ్రాన్స్ ఉన్నత విద్య, పరిశోధన, అంతరిక్ష శాఖ మంత్రి శ్రీ ఫిలిప్ బాప్టిస్ట్‌తో కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ ప్రల్హాద్ జోషి న్యూఢిల్లీలో ఈ రోజు ద్వైపాక్షిక సమావేశాన్ని నిర్వహించారు. విద్యను, పరిశోధనలను ముందుకు తీసుకు పోవడానికి విద్యార్థులను, ఉపాధ్యాయులను, పరిశోధకులను నిర్ణీత కాలం పాటు ఇరు దేశాలూ పరస్పరం ఆదరించుకోవడం, నూతన ఆవిష్కరణలు, సంస్థాగత భాగస్వామ్యం వంటి విషయాల్లో భారత్-ఫ్రాన్స్ సహకారాన్ని పటిష్టపరుచుకోవడానికి చేపట్టవలసిన కార్యాచరణపై మంత్రులు ఇద్దరూ చర్చించారు.

ఫ్రాన్స్ మంత్రికి, ఆయన ప్రతినిధివర్గానికి శ్రీ ప్రల్హాద్ జోషి స్వాగతం పలికారు. భారత్-ఫ్రాన్స్ చిరకాల భాగస్వామ్యాన్ని ఆయన ప్రస్తావించారు. విద్యారంగంలో సహకారం ఇరు దేశాల సంబంధాల్లో కీలక పాత్రను పోషిస్తోందని మంత్రి స్పష్టం చేశారు. విద్య, పరిశోధన, నూతన ఆవిష్కరణలలో సమన్వయాన్ని మరింత పెంపొందించుకోవడానికి ఒక చక్కని అవకాశాన్ని 'భారత్-ఫ్రాన్స్ నూతన ఆవిష్కరణల సంవత్సరం-2026' అందిస్తోందన్నారు.

ఉన్నత విద్య రంగంలో సహకారానికి గల అవకాశాలపై ఇరు పక్షాలు చర్చించాయి. ఈ అవకాశాల్లో.. సంస్థాగత సంబంధాలను పటిష్టపరచడం, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పరిశోధకులను నిర్ణీత కాలం పాటు ఇటు వారిని అటు, అటు వారిని ఇటు పంపించడంతో పాటు, సహకార ప్రధాన విద్యా కార్యక్రమాలు, బృందాల పర్యటనలకు మరిన్ని అవకాశాలను కల్పించడం భాగంగా ఉన్నాయి. లైఫ్ సైన్సెస్, సోషల్ సైన్సెస్, మానవ విజ్ఞానశాస్త్రాల్లో కూడా ఇదివరకటితో పోలిస్తే ఎక్కువ సహకారానికి ఎంతవరకు అవకాశాలు ఉన్నాయో పరిశీలించారు. సంస్థాగత ఆదాన ప్రదానం, పరస్పర సహకారంతో విద్యా సంబంధ కార్యకలాపాలను నిర్వహించుకోవడంతో పాటు పరిశోధనపై ఈ సందర్భంగా దృష్టి ఉభయ దేశాల మధ్య జ్ఞాన భాగస్వామ్యాలను మరింతగా ప్రోత్సహించే అంశంపై అభిప్రాయాలను మంత్రులు వ్యక్తం చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న సంస్థాగత సహకారాన్ని బలోపేతం చేయడంతో పాటు, సంయుక్త విద్యా, పరిశోధన కార్యక్రమాలను కొత్త కోణాలలో కూడా విస్తరించగలగడానికి ఉన్న అవకాశాలపై చర్చించారు. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీ సహా భారతదేశంలో ఫ్రాన్స్ కంపెనీలు కార్యకలాపాలను నిర్వహిస్తున్న ప్రాంతాల్లో ఆయా కంపెనీలకు సాంకేతిక నిపుణుల సేవలు అవసరమవుతున్నందువల్ల ఆయా ప్రాంతాల్లో ఫ్రెంచి ఉన్నత విద్యాసంస్థలు తమ శాఖలను ప్రారంభించేందుకు అవకాశాలు ఉన్నాయా అన్నది బేరీజు వేయాలని ద్వైపాక్షిక సమావేశంలో సూచించారు.

రెండు దేశాల ప్రజల మధ్య పరస్పర సంబంధాలకు ప్రాధాన్యాన్ని ఇవ్వవలసిన అవసరం ఉందని ఇరు పక్షాలు అంగీకరిస్తూ భాషలను నేర్చుకోవడానికి ప్రస్తుతం అందుబాటులో ఉన్న అవకాశాలను పెంపొందింపచేయడం, అలాగే విద్యాబోధన పట్ల ఆసక్తి కలిగిన వారికి శిక్షణ ఇవ్వడం, విద్యారంగంలో ప్రవీణుల సేవలను పరస్పరం వినియోగించుకోవడం, సాంకేతికత ఆధారిత విద్యాబోధనను ప్రోత్సహించడంపై చర్చించారు. భారత్, ఫ్రాన్స్‌ల మధ్య పరస్పర అర్హతల గుర్తింపు ఒప్పందం పునస్సమీక్ష, డిజిటల్ మాధ్యమంలో విద్యాబోధనకు సంబంధించి అత్యుత్తమ పద్ధతులను ఇచ్చి పుచ్చుకోవడం, నాణ్యమైన విద్యాబోధన పరిధిని విస్తరించడానికి సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగించుకోవడం వంటి అంశాలు కూడా చర్చల్లో చోటు చేసుకున్నాయి. ఉన్నత విద్య, నూతన ఆవిష్కరణలు, భాషాపరమైన విద్య, డిజిటల్ మాధ్యమం సేవలను వినియోగించుకొంటూ విద్యాబోధన వంటి రంగాల్లో భారత్-ఫ్రాన్స్ సహకారాన్ని మరింత విస్తరించే విషయంలో ఇరు పక్షాలు తమ నిబద్ధతను పునరుద్ఘాటించి, సమావేశం ముగిసినట్లు ప్రకటించాయి.

# నూతన డైరెక్టర్ దొంతిరి సోమిరెడ్డికి సత్కారం



నల్గొండ, సెప్టెంబర్ 29: నార్ముల్ మదర్ డెయిరీ డైరెక్టర్ గా గెలుపొందిన దొంతిరి సోమిరెడ్డి బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డిలు మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు.

ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుతో నార్ముల్ మదర్ డెయిరీ డైరెక్టర్‌గా గెలుపొందిన దొంతిరి సోమిరెడ్డిని? హరీష్ రావు, జగదీష్ రెడ్డిలు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ విజయం కోసం కష్టపడి పనిచేసిన నాయకులకు, కార్యకర్తలకు ఈ సందర్భంగా వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, నార్ముల్ మదర్ డెయిరీ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్ రెడ్డి, యాదగిరిగుట్ట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పట్టణ అధ్యక్షుడు పాపట్ల నరహరి, డైరెక్టర్లు సంధిల్ల భాస్కర్ గౌడ్, ఒగ్గు భిక్షపతి, కస్తూరి పాండు, మైలార్‌గూడెం గ్రామ సర్పంచ్ మారెడ్డి కొండల్ రెడ్డితో పాటు నాయకులు రమణారెడ్డి, సతీష్ రెడ్డి, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే పద్మావతి రెడ్డికి సన్మానం

నల్గొండ, సెప్టెంబర్ 29: నియోజకవర్గంలో సుమారు రూ.2,000 కోట్ల విలువైన అభివృద్ధి పనులను చేపట్టి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నఎమ్మెల్యే నలమాద పద్మావతి రెడ్డిని పట్టణ ఆర్యవైశ్యులైన రాయపూడి మిత్రమండలి సభ్యులు వారి నివాసంలో ఘనంగా సన్మానించారు.

ఇటీవల కోదాడలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను విజయవంతం చేసి, పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులకు సుమారు 5,650 ఉద్యోగ అవకాశాలను కోదాడకే తీసుకువచ్చి అందించినందుకు ఎమ్మెల్యే పద్మావతి రెడ్డికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. అలాగే కోదాడ పట్టణంలో బస్టాండ్, కోర్టు భవనం, ప్రభుత్వ ఆసుపత్రి, మున్సిపల్ భవనం, ఆర్అండ్‌బీ భవనం, మినీ ట్యాంక్ బండ్ తదితర అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా పూర్తయ్యేలా ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ అధికారులను సమన్వయం చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో కోదాడ ఆర్యవైశ్య పెద్దలు ఓరుగంటి ప్రభాకర్, రాయపూడి వెంకటనారాయణ, ఇమ్మడి సతీష్ బాబు, వంగవీటి గురునాథం, బండారు శ్రీనివాసరావు, బెలిదె అశోక్, బూరెల కరుణాకర్, చీదేళ్ల హనుమంతరావు, యలగందుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఇండస్ట్రియల్ రిలేషన్స్ అండ్ లేబర్, అవార్డ్స్-2026ను ఉద్దేశించి ప్రసంగించిన డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29ఇవాళ న్యూఢిల్లీలో నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఇండస్ట్రియల్ రిలేషన్స్ అండ్ లేబర్, అవార్డ్స్-2026ను కేంద్ర కార్మిక, ఉపాధి, యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ ప్రారంభించారు. "ఏఐ యుగంలో పారిశ్రామిక సంబంధాలు, కార్యాలయ భాగస్వామ్య పునర్నిర్మాణం" ఇతివృత్తంతో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఎంప్లాయర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఈఎఫ్ఐ) సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహించాయి.

సభను ఉద్దేశించి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ మాట్లాడుతూ... మారుతున్న కాలం, వాస్తవ ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా భారతదేశ శ్రామిక, సామాజిక భద్రతా వ్యవస్థలను అభివృద్ధి చేయవలసిన అవసరాన్ని తెలియజేశారు. కృత్రిమ మేధ ద్వారా నేటి ప్రపంచంలో ఎన్నో అవకాశాల ద్వారాలు తెరుచుకుంటాయని చెబుతూ... ఏఐ, ఆటోమేషన్, రోబోటిక్స్, ఇతర అత్యాధునిక సాంకేతికతల్లో భారతదేశ యువతకు సరికొత్త నైపుణ్య శిక్షణ ఇవ్వాల్సిన ప్రాముఖ్యత గురించి ప్రస్తావించారు. 2026లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రకటనను ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాబోయే ఏడాదిలో కోటి మంది యువతకు ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రధానమంత్రి ప్రకటించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు.

అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) గుర్తింపు ప్రకారం... గత దశాబ్ద కాలంలో భారతదేశంలో సామాజిక భద్రతా పరిధి గణనీయంగా విస్తరించిందని కేంద్రమంత్రి పేర్కొన్నారు. 2015లో కేవలం 19 శాతం మందికి మాత్రమే ఉన్న భద్రత... నేడు దేశ జనాభాలో 68 శాతానికి, అంటే 101 కోట్ల మందికి వర్తిస్తోందని ఆయన వెల్లడించారు. కార్మిక అనుకూల విధానాలు, పారిశ్రామిక అనుకూల విధానాలు ఒకదానికొకటి వ్యతిరేకమనే సంప్రదాయ భావనను మార్చుకోవాలని కేంద్రమంత్రి పిలుపునిచ్చారు. పరిశ్రమలు, కార్మికులు దేశ నిర్మాణంలో భాగస్వాములుగా కలిసి ముందుకు సాగాలని కోరారు.

కార్మిక చట్టాలపై "శ్రమ్ సంవాద్" పేరుతో కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ భారీ అవగాహనా కార్యక్రమాన్ని నేటి నుంచి ప్రారంభిస్తున్నట్లు డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ ప్రకటించారు. రాబోయే 90 రోజుల్లో దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలోని 316 జిల్లాల్లోని పారిశ్రామిక క్లస్టర్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. పారిశ్రామిక సంబంధాలను బలోపేతం చేయటంలో అన్ని వర్గాల భాగస్వాముల మధ్య నిరంతర చర్చలు, సంప్రదింపుల ప్రాముఖ్యతను డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ స్పష్టం చేశారు. "ఎక్కడైతే చర్చలు జరుగుతాయో... అక్కడ పరిష్కారం ఉంటుంది" అని ఆయన అన్నారు. పరిశ్రమలు, కార్మికుల ప్రయోజనాలు కలిసి ముందుకు సాగేలా స్నేహపూర్వక పారిశ్రామిక సంబంధాలను పెంపొందించేందుకు ఉత్తమ పద్ధతులను అందరూ పంచుకోవాలని, ఆచరించాలని స్పష్టం చేశారు.

ఇండియా సాధించిన 7.8 శాతం అధిక జీడీపీ వృద్ధిని తెలియజేస్తూ... దేశం బలమైన వృద్ధి పథాన్ని కొనసాగించేందుకు వీలుగా ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఆర్థిక విధానాల గురించి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ వివరించారు. భారతదేశ బలమైన ఆర్థిక వృద్ధికి తగినట్లుగానే ఇటీవల ఉపాధి అవకాశాలు కూడా పెరిగాయన్నారు. 2017-23 మధ్య కాలంలో ఆర్థిక వ్యవస్థలో ప్రతి ఒక శాతం వృద్ధికి 1.11 శాతం చొప్పున ఉపాధి వృద్ధి జరిగిందని... ఇది గతంలో కేవలం 0.008 శాతంగా మాత్రమే ఉండేదని చెప్పారు. సుస్థిర ఆర్థికాభివృద్ధి, విస్తృత ఉపాధి అవకాశాలు, గౌరవప్రదమైన శ్రామిక శక్తి ప్రధాన ప్రాతిపదికగా... వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనకు భాగస్వాములందరూ సమష్టిగా కృషి చేయాల్సిన అవసరాన్ని ఆయన స్పష్టం చేశారు.

ప్రారంభ సమావేశంలో "ఎంప్లాయర్స్ గైడ్ అండర్ న్యూ లేబర్ కోడ్స్ ఫ్రేమ్‌వర్క్: ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ ఇన్ ఇండియా" నివేదికను కేంద్రమంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ ఆవిష్కరించారు.

ఈ సదస్సుకు సీఐఐ నార్తర్న్ రీజియన్ చైర్మన్ శ్రీ పునీత్ కౌరా, సీఐఐ ఇండస్ట్రియల్ రిలేషన్స్, లేబర్‌పై జాతీయ కమిటీ సహ-అధ్యక్షుడు శ్రీ హర్షవర్ధన్ చితాలే, ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్ఓ) ప్రాంతీయ భాగస్వామ్య అభివృద్ధి, వనరుల సమీకరణ డిప్యూటీ డైరెక్టర్, సీనియర్ సలహాదారు శ్రీ ఒక్తావియాంటో పసరిబు, పరిశ్రమ రంగ ప్రతినిధులు, కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ అధికారులు హాజరయ్యారు.

భవిష్యత్తులో ఉద్యోగాలు, పారిశ్రామిక సంబంధాలపై వివిధ అభిప్రాయాలను పంచుకునేందుకు పరిశ్రమ, కార్మిక వర్గాలకు ఈ సదస్సు వేదికను అందిస్తుంది. సాంకేతిక పరివర్తన, మారుతున్న ఉపాధి వ్యవస్థ వల్ల ఏర్పడే అవకాశాలు, సవాళ్లను మెరుగ్గా అర్థం చేసుకునేందుకు ఈ అంశాలపై జరిగే చర్చలు దోహదపడతాయని భావిస్తున్నారు.

# వారణాసి డివిజన్‌లో 614.75 రూట్ కిలోమీటర్ల మేర కవచ్ 4.0 అమలుకు రూ.223 కోట్లు మంజూరు చేసిన భారతీయ రైల్వే

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 దేశీయ సాంకేతికత ద్వారా రైల్వే భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా కీలక చర్యలో భాగంగా.. ఈశాన్య రైల్వే పరిధిలోని వారణాసి (బీఎస్‌బీ) డివిజన్‌లో 614.75 రూట్ కిలోమీటర్ల మేర రూ. 223 కోట్ల వ్యయంతో కవచ్ వెర్షన్ 4.0ను ఏర్పాటు చేసేందుకు భారతీయ రైల్వే ఆమోదం తెలిపింది.

ఈ ప్రాజెక్టుకు ఆమోదం లభించడం ద్వారా వారణాసి డివిజన్‌లో గుర్తించిన మిగిలిన మార్గాల్లో కవచ్ 4.0 పరిధిని విస్తరించనున్నారు. తద్వారా రైళ్ల రాకపోకలకు అందుబాటులో ఉన్న భద్రతా మౌలిక సదుపాయాలు మరింత బలోపేతం కానున్నాయి.

దేశీయంగా అభివృద్ధి చేసిన ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (స్వయంచాలక రైలు రక్షణ-ఏటీపీ) వ్యవస్థే కవచ్. ఇది రైళ్ల నిర్వహణ భద్రతను మెరుగుపరచడానికి రూపొందించారు. ప్రమాదకర పరిస్థితులలో సిగ్నల్ దాటడాన్ని (ఎస్‌పీఏడీ) నివారించడంలో ఇది సహాయపడుతుంది. అవసరమైనప్పుడు స్వయంచాలకంగా బ్రేకులు వేయడంతోపాటు, రైళ్ల రాకపోకలను పర్యవేక్షించడం ద్వారా మరింత సురక్షితమైన రైలు ప్రయాణానికి తోడ్పడుతుంది.

సర్క్యులర్ ఎకానమీ, కీలక ఖనిజాల వెలికితీతను ప్రోత్సహించడం లక్ష్యంగా

# 'ప్రత్యేక ప్రచారం-6' ద్వారా ఇ-వ్యర్థాల సేకరణ కార్యక్రమాన్ని బలోపేతం చేస్తున్న గనుల మంత్రిత్వశాఖ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29భారత ప్రభుత్వ గనుల మంత్రిత్వశాఖ 'ప్రత్యేక ప్రచారం 6.0' ద్వారా ఇ-వ్యర్థాల సేకరణను మరింత వేగవంతం చేస్తోంది. బాధ్యతాయుతమైన ఇ-వ్యర్థాల నిర్వహణ, పనికిరాని వస్తువుల నుంచి తిరిగి వనరులను సేకరించడం, పర్యావరణహిత సర్క్యులర్ ఎకానమీని ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టింది.

ఈ ప్రచార కార్యక్రమానికి నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్న నాగపూర్‌కు చెందిన 'జవహర్‌లాల్ నెహ్రూ అల్యూమినియం రీసెర్చ్ డెవలప్‌మెంట్ అండ్ డిజైన్ సెంటర్', 'మెటీరియల్ రీసైక్లింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా'ల భాగస్వామ్యంతో సమన్వయం చేస్తూ దీనిని అమలు చేస్తోంది. గనుల మంత్రిత్వ శాఖకు అనుబంధంగా ఉన్న వివిధ కార్యాలయాలు, సంస్థల ద్వారా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఇ-వ్యర్థాల సేకరణ, అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు

ఈ ప్రచార కార్యక్రమం కోసం దేశవ్యాప్తంగా 44కి పైగా కార్యాలయ ప్రాంతాలను ఖరారు చేశారు. కేవలం మహారాష్ట్రలోనే ఇ-వ్యర్థాల సేకరణ కోసం 28కి పైగా ప్రాంతాలను గుర్తించారు. వివిధ కార్యాలయాలు, సంస్థలు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భాగస్వాములు కావడం... ఇ-వ్యర్థాల బాధ్యతాయుత సేకరణ, సురక్షిత డిస్పోజల్ కోసం జరుగుతున్న ఉమ్మడి కృషికి నిదర్శనంగా నిలుస్తోంది. న్యూఢిల్లీలోని గనుల మంత్రిత్వశాఖ కార్యాలయం ఇందులో ఒక సేకరణ కేంద్రంగానూ ఉంది. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన ఇ-వ్యర్థాలను, సరైన పద్ధతుల ద్వారా సురక్షితమైన రీసైక్లింగ్, వనరుల పునరుద్ధరణ ప్రక్రియలకు తరలిస్తారు.

ఇ-వ్యర్థాలు కేవలం పారవేసే చెత్త మాత్రమే కాదు... వాటిలో విలువైన ద్వితీయ శ్రేణి వనరులు ఉన్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అవసరమయ్యే ఎన్నో కీలక ఖనిజాలు, లోహాలు వివిధ ఎలక్ట్రానిక్ వస్తువుల్లో ఉంటాయి. ఇ-వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడం ద్వారా ఆ వనరులను సమర్థంగా వాడుకోవచ్చు. కీలక ఖనిజాల సర్క్యులర్ ఎకానమీని బలోపేతం చేయవచ్చు. బాధ్యతాయుతమైన రీసైక్లింగ్ పద్ధతులను ఉపయోగించి ఈ విలువైన పదార్థాలను తిరిగి పొందడం ద్వారా భూమి నుంచి నేరుగా తీసే ప్రాథమిక ఖనిజ వనరులపై ఒత్తిడి తగ్గుతుంది. ఇది వనరుల దీర్ఘకాలిక, సుస్థిర వినియోగానికి ఎంతగానో దోహదపడుతుంది.

ఈ ప్రచార కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయడానికి వీలుగా... గనుల మంత్రిత్వ శాఖ పరిధిలోని వివిధ కార్యాలయాలు, సంస్థల నోడల్ అధికారులతో జేఎన్ఏఆర్‌డీడీసీ ముందస్తు సమన్వయ సమావేశాలను వీడియో అనుసంధానం ద్వారా నిర్వహించింది. ఈ సమావేశాల్లో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్, నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్, హిందుస్థాన్ జింక్ లిమిటెడ్, మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ కన్సల్టెన్సీ లిమిటెడ్, హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ వంటి ప్రముఖ ప్రభుత్వ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

గనుల మంత్రిత్వశాఖతో పాటు దాని ప్రాంతీయ కార్యాలయాలు, సంస్థలు... ఈ ప్రచారంలో ఉద్యోగులు, భాగస్వామ్య పక్షాలు పెద్ద ఎత్తున పాల్గొనేలా ప్రోత్సహించడానికి వివిధ అవగాహన కార్యక్రమాలు, ప్రచారాలు, పోటీలను నిర్వహిస్తున్నాయి. ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ వస్తువుల బాధ్యతాయుత డిస్పోజల్ గురించి అవగాహన పెంపొందించడం, వీలైనంత వరకు పాత వస్తువులను తిరిగి ఉపయోగించడం, వేరే అవసరాలకు అనుగుణంగా వాటిని మార్చుకోవడం, రీసైక్లింగ్ చేయడాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశం.

ఈ ప్రచారం ద్వారా వనరుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యాన్ని గనుల మంత్రిత్వశాఖ విస్తృతంగా ప్రోత్సహిస్తోంది. ఇ-వ్యర్థాల సేకరణ, వర్గీకరణ, రీసైక్లింగ్, వాటి నుంచి విలువైన పదార్థాలను తిరిగి పొందడం కోసం బాధ్యతాయుతమైన పద్ధతులను అవలంబించేలా ప్రజలను చైతన్యపరుస్తోంది. సుస్థిర వనరుల నిర్వహణ, పర్యావరణ బాధ్యత, సర్క్యులర్ ఎకానమీని ప్రోత్సహించడం లక్ష్యంగా చేపట్టిన ఈ 'ప్రత్యేక ప్రచారం 6.0' విస్తృత ఆశయాలకు ఈ కార్యక్రమం మరింత బలాన్ని చేకూరుస్తుంది.

# జర్నలిస్టు వృత్తి కత్తితో సాము లాంటిది..

## -బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి




నిజామాబాద్, సెప్టెంబర్ 29:సమాజంలో జర్నలిస్టుల వృత్తి కత్తితో సాము లాంటిదని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం బాన్సువాడ పట్టణంలో ప్రారంభమైన జర్నలిస్టుల శిక్షణా తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా జర్నలిస్టులు పనిచేస్తున్నారని చెప్పారు. సమాజంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు వారికి ఒక వేదిక లాంటిదని తెలిపారు. ఏ ఒక పార్టీకి అనుకూలంగా జర్నలిస్టులు పనిచేయరని చెప్పారు. రాత్రి పగలు అన్న తేడా లేకుండా జర్నలిస్టులు ప్రజా సమస్యలను అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇలాంటి శిక్షణ తరగతుల ద్వారా మంచి కథనాలు రాసేందుకు అవకాశం లభిస్తుందని చెప్పారు. జర్నలిజంలో కొత్తగా చేరిన వారు శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మెరుగైన జర్నలిజం కోసమే మీడియా అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. వార్తలు రాసే విధానంపై సీనియర్ జర్నలిస్టులు ఇచ్చే సలహా సూచనలను పాటిస్తూ వార్తా సేకరణలు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు విరహత్ అలీ, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు రజనీకాంత్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు శ్రీనివాస్, పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

# కేజీబీవీకి 35 డ్యూయల్ డెస్క్ బెంచీలు



నిజామాబాద్, సెప్టెంబర్ 29: నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం లోని భీమ్‌గల్ మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థుల కోరిక మేరకు 35 డ్యూయల్ డెస్క్ బెంచీలను పంపిణీ చేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి కృషితో పారిశ్రామికవేత్త ఏనుగు దయానంద్ రెడ్డి సహకారంతో ఈ బెంచీలను సమకూర్చారు.

ఈ సందర్భంగా కేజీబీవీ ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ.. విద్యార్థులకు డ్యూయల్ డెస్క్ బెంచీలు అవసరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. విద్యార్థుల అవసరాన్ని గుర్తించిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పారిశ్రామిక వేత్త ఏనుగు దయానంద్ రెడ్డిని కోరగా, ఆయన వెంటనే స్పందించి 35 డ్యూయల్ డెస్క్ బెంచీలను అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, దయానంద్ రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కేజీబీవీలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు డ్యూయల్ డెస్క్ బెంచీలను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బోదిరే నర్సయ్య, శర్మ నాయక్, మాజీ కౌన్సిలర్ సతీష్ గౌడ్, ముత్యన్న, మల్లెల ప్రసాద్, మూత లింబాద్రి, రతన్ రాజ్, అశోక్, అరుణ్, సురేష్, గంగాధర్, శంకర్, గోపి, అబ్బ, కేజీబీవీ ప్రిన్సిపాల్ అనురాధ, ఉపాధ్యాయులు మాధవి, నికిత రాణి, విజయలక్ష్మి, సప్న తదితరులు పాల్గొన్నారు.

# సాధన శృంఖల 2026: ప్రాంతీయ స్థాయిలో శిక్షణ సంస్థల రూపాంతరం దిశగా కొత్త కార్యక్రమం

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 29:మిషన్ కర్మయోగి కింద శిక్షణ సంస్థలను వ్యూహాత్మక, సామర్థ్య నిర్మాణ సంస్థలుగా మార్చడానికి కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ (సీబీసీ) దేశవ్యాప్తంగా 'సాధన శృంఖల 2026' పేరుతో ప్రాంతీయ సదస్సులను నిర్వహిస్తోంది. సాధన అంటే జాతీయ అభివృద్ధి కోసం అనుకూల అభివృద్ధి, మానవీయ సామర్థ్యాలను బలోపేతం చేయడం అని అర్థం. గత ఏప్రిల్ 2 నుంచి 8 వరకు జరిగిన సాధన సప్తాహ్ 2026, మే 15న జరిగిన "సంస్థాగత సామర్థ్య పెంపుదల: శిక్షణ నుంచి పనితీరు-ఆధారిత పాలన వరకు" జాతీయ శిఖరాగ్ర సదస్సుల్లో చర్చించిన అంశాల ఆధారంగా ఈ సాధన శృంఖలను రూపకల్పన చేశారు.

ఈ సాధన శృంఖల ప్రాంతీయ వర్క్‌షాప్‌లు ఒకటిన్నర రోజుల కార్యక్రమంగా రూపొందించారు. ఈ కార్యక్రమానికి ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సీనియర్ అధికారులు, శిక్షణ సంస్థల అధిపతులు, అధ్యాపకులు, ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూలు), పరిశ్రమ భాగస్వాములు, విషయ నిపుణులు, అంకుర సంస్థల ప్రతినిధులు ఒకే వేదికపైకి రానున్నారు.

ఈ ప్రాంతీయ సదస్సులు సెప్టెంబర్ 29, 30 తేదీల్లో ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో దక్షిణ ప్రాంత వర్క్‌షాప్‌తో ప్రారంభమవుతాయి.

ఆ తర్వాత అక్టోబర్ 9,10 తేదీల్లో అస్సాం లోని గువాహటిలో ఈశాన్య ప్రాంతం, అక్టోబర్ 23, 24 తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఉత్తర ప్రాంతం, నవంబర్ 16,17 తేదీల్లో (ఖరారు కావాల్సి ఉంది) మహారాష్ట్రలోని పూణేలో పశ్చిమ ప్రాంత వర్క్‌షాప్‌లు జరుగుతాయి. కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ సమక్షంలో, ఆతిథ్య రాష్ట్రాల ముఖ్యమంత్రుల చేతుల మీదుగా ఈ వర్క్‌షాప్‌లు ప్రారంభమవుతాయి.

విజయవాడలో జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ సమక్షంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన అధికారులు, శిక్షణా సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు.

సంస్థాగత పరివర్తనపై జరుగుతున్న జాతీయ చర్చను స్థానిక అవసరాలకు అనుగుణంగా మార్చడానికి, కార్యాచరణలోకి తీసుకురావడానికి ఈ సాధన శృంఖల ఆయా ప్రాంతాలకు తీసుకెళ్తోంది. శిక్షణ సంస్థలు కేవలం శిక్షణ ఇచ్చే సాధారణ సంస్థల నుంచి వ్యూహాత్మక, నైపుణ్య ఆధారిత సామర్థ్య నిర్మాణ సంస్థలుగా మారడానికి ఒక సమగ్ర మార్గదర్శక వ్యవస్థ అవసరమని గతంలో జరిగిన చర్చలు స్పష్టం చేశాయి.

వివిధ రాష్ట్రాలు, శిక్షణ సంస్థలు, ఇతర భాగస్వామ్య వర్గాలను భాగస్వాములను చేస్తూ, వివిధ సంస్థల అవసరాలకు శిక్షణ సంస్థలను సామర్థ్య నిర్మాణ సంస్థలుగా తీర్చిదిద్దడమే ఈ ప్రాంతీయ వర్క్‌షాప్‌ల ప్రధాన ఉద్దేశం. ఇందులో సామర్థ్య నిర్మాణ ప్రణాళికలు (సీబీపీలు) కీలకంగా ఉంటాయి. ప్రభుత్వంలో వివిధ బాధ్యతలు నిర్వహించే సిబ్బందికి అవసరమైన నైపుణ్యాలను గుర్తించి, వాటికి అనుగుణంగా సంస్థలు చేపట్టాల్సిన చర్యలను ఈ ప్రణాళికలు నిర్దేశిస్తాయి. "సరైన పాత్రకు, సరైన సమయంలో, సరైన సామర్థ్య నిర్మాణం" అందించడమే దీని లక్ష్యం. ఈ సమావేశాల్లో సంస్థల పాలన, నాయకత్వాన్ని మెరుగుపరిచే విధానాలు, సంస్థల పనితీరు, పరస్పర సహకారం, కర్మయోగి నాణ్యతా విధానానికి (కేక్యూఎఫ్) అనుగుణంగా శిక్షణ నాణ్యతను పెంచడం, బోధకులు, సిబ్బంది నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, డిజిటల్, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను క్రమబద్ధంగా వినియోగించడం వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయి.

ఈ సంస్థాగత పరివర్తన అమలును ఏకీకృత నూతన తరం జాతీయ శిక్షణా కార్యక్రమం (యూఎన్ఎన్ఏటీఐ- ఉన్నతి) వేదిక ద్వారా ముందుకు తీసుకెళ్తారు. దేశవ్యాప్తంగా ఉన్న 900కు పైగా శిక్షణ సంస్థలను ఒకే డిజిటల్ వేదికపైకి తీసుకురావడం ద్వారా, ఈ ఫ్రేమ్‌వర్క్ లక్ష్యాలను ఉన్నతి వేదిక ఆచరణలోకి తెస్తుంది.

# పాఠశాలకు 10 డ్యూయల్ డెస్క్ బెంచీల విరాళం



నిజామాబాద్, సెప్టెంబర్ 29:నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి నివాసంలో మంగళవారం పాఠశాలకు డెస్క్ బెంచీలను అందజేశారు. పారిశ్రామికవేత్త, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి వియ్యంకుడు దయానంద్ రెడ్డి రూ. 50 వేలు విలువగల 10 డ్యూయల్ డెస్క్ బెంచీలను విరాళంగా అందించారు. వీటిని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పాఠశాల యాజమాన్యానికి అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా విరాళాలు అందిస్తున్నామని, దాతల సహకారంతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని అన్నారు

. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సౌత్ కోస్ట్ రైల్వే పరిధిలో విజయవాడ మీదుగా మచిలీపట్నం-కర్నూలు మధ్య వారానికి మూడుసార్లు నడిచే కొత్త రైలుకు భారతీయ రైల్వే ఆమోదం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29: ఆంధ్ర ప్రదేశ్ ప్రయాణికులకు పెద్ద ఊరటనిస్తూ, సౌత్ కోస్ట్ రైల్వే పరిధిలోని విజయవాడ మీదుగా మచిలీపట్నం-కర్నూలు మధ్య కొత్తగా వారానికి మూడు రోజులు నడిచే రైలు సేవకు భారతీయ రైల్వే ఆమోదం తెలిపింది. దీనివల్ల రాష్ట్రంలోని తీరప్రాంతం నుంచి మధ్య ప్రాంతాలకు అదనపు రైలు రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది.తాజాగా ఆమోదం పొందిన మచిలీపట్నం- కర్నూలు సిటీ ఎక్స్‌ప్రెస్ 499 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. ఇది మచిలీపట్నం నుంచి 16:55 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 05:45 గంటలకు కర్నూలు సిటీకి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో, కర్నూలు సిటీ- మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ కర్నూలు సిటీ నుంచి 09:30 గంటలకు బయలుదేరి, అదే రోజు రాత్రి 21:35 గంటలకు మచిలీపట్నం చేరుకుంటుంది. మచిలీపట్నం-కర్నూలు సిటీ ఎక్స్‌ప్రెస్ సోమ, బుధ, శనివారాల్లో నడుస్తుంది. కర్నూలు సిటీ-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ మంగళ, గురు, ఆదివారాల్లో నడుస్తుంది.

ఈ కొత్త రైలు సేవ ఆంధ్రప్రదేశ్ ప్రయాణికులకు అదనపు ప్రయాణ అవకాశాన్ని కల్పించడంతో పాటు... మచిలీపట్నం, విజయవాడ, కర్నూలు నగరాల మధ్య రవాణా అనుసంధానాన్ని బలోపేతం చేస్తుంది. ఈ మార్గంలోని అనేక పట్టణాలు, నగరాలకు రాకపోకల సౌలభ్యాన్నీ మెరుగుపరుస్తుంది.

# 550 పడకల ఆస్పత్రి నిర్మాణ పనుల పరిశీలన

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 29:: నాగర్‌కర్నూల్ పట్టణంలో మెడికల్ కాలేజీకి అనుబంధంగా 10 ఎకరాల విస్తీర్ణంలో రూ.235 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న550 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను మంగళవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, పరిశీలించారు.

ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి ఆస్పత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులకు సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నిర్దేశిత ప్రమాణాల ప్రకారం నిర్మాణం జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 550 పడకల ఆసుపత్రి అందుబాటులోకి వస్తే నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు.

# ఆధునిక భారతదేశానికి రూపశిల్పి మీనన్

ఆయన పేరు మీద ఒక్క జీవిత చరిత్ర లేదు. పాఠశాలల సిలబస్‌లో ఆయన రచనల ప్రస్తావన లేదు. చివరి ముగ్గురు వైస్రాయ్‌లకు వారి రాజ్యాంగ సలహాదారుగా సేవలందించిన ప్రతిభా శాలి, సమర్థ అధికారి ఆయన. స్వతంత్ర భారత దేశంలో, అధికార బదిలీల కీలక పాత్ర ధారిగా, కొత్తగా ఏర్పడిన రాష్ట్రాల శాఖ కార్యదర్శిగా, తరువాత ఒడిశా గవర్నర్‌గా పని చేశాడు. దేశం లోని ఒక చిన్న గ్రామంలో జన్మించిన ఆయన అసమాన ప్రతిభతో అత్యున్నత స్థాయి భారతీయ అధికారిగా ఎదిగాడు. ఆయనే ఆధునిక భారతదేశానికి రూపశిల్పి వి. పి. మీనన్.

వప్పల పంగుణ్ణి మీనన్ (1893 సెప్టెంబరు 30 – 1965 డిసెంబరు 31) భారతీయ సివిల్ సర్వీసెస్ అధికారి. ఆయన భారత దేశపు చిట్ట చివరి లిన్లిత్‌గో, వేవెల్, మౌంట్ బాటన్ అనే చివరి ముగ్గురు వైస్రాయ్‌లకు రాజ్యాంగ సలహాదారు అయ్యాడు. రాజ్యాంగ సలహాదారుగా, రాజకీయ సంస్కరణల కమిషనర్ గానూ పని చేశాడు. బ్రిటీష్ ప్రభుత్వం నుంచి బ్రిటీష్ ఇండియాకు స్వతంత్రం రావడం లో అత్యంత కీలకమైన అధికార బదిలీలోని భారత విభజన, భారత స్వాతంత్ర్య చట్టం, భారతదేశ ఏకీకరణ, భారత రాజ్యాంగ రచన వంటి అంశాల్లో బ్రిటీష్ ప్రభు త్వానికి, కొత్తగా ఏర్పడిన భారత ప్రభుత్వానికి సహకరిస్తూ కీలక బాధ్యతలు నిర్వర్తించాడు.

బ్రిటీష్, భారతీయ అధికారు లచే విశ్వసించ బడిన మీనన్ ఒక సామాన్య కుటుంబం నుండి వచ్చాడు. ఒట్టప్పలం లోని పనమన్న వద్ద 1893 సెప్టెంబరు 30న జన్మించాడు. 13 సంవత్సరాల వయస్సులో, నిర్మాణ కార్మికుడిగా, బొగ్గు గని కార్మికు డిగా, ఫ్యాక్టరీలో వరుసగా పని చేయడానికి పాఠశాలను విడిచి పెట్టాడు. 8వ తరగతి వరకు మాత్రమే చదివిన మీనన్, రెండు వేళ్లతో టైప్ చేయడం నేర్చిన తరువాత, 1929లో సిమ్లాలో భారత పరిపాలనలో హోం శాఖలో గుమాస్తాగా ఉద్యోగం లో చేరాడు. 1947 నాటికి, మీనన్ వైస్రాయ్ సిబ్బందిలో అత్యంత సీనియర్ పోస్టుకు ఎదిగాడు, మౌంట్ బాటన్ విశ్వాసాన్ని, ప్రేమను పొందాడు.

స్వాతంత్ర్యానికి ముందు భారత గవర్నర్ జనరల్‌కు రాజ్యాంగ సలహాదారుగా మారారు. అంతకు ముందు, బ్రిటిష్ వలస రాజ్యాల సంస్కరణ కార్యాల యంలో అనేక ముఖ్యమైన పదవులను నిర్వహించాడు. 1942–47 మధ్య సంస్కర ణల కమిషనర్‌గా పనిచేశాడు. 1946లో బ్రిటిష్ వైస్రాయ్‌కు రాజ కీయ సంస్కరణల కమిషనర్‌గా నియమితు డయ్యాడు. 1947–51 సంవత్స రాలలో రాష్ట్ర మంత్రిత్వ శాఖలో కార్యదర్శిగా నియమిం చ బడ్డాడు.

## సెప్టెంబర్ 30... చరిత్ర మరిచిన వి. పి. మీనన్ జయంతి



మౌంట్ బాటన్ ప్రణాళికకు ప్రత్యామ్నాయంగా దేశ విభజ నకు సంబంధించి ఆయన రూపొందించిన ముసాయిదా, ముఖ్యంగా ముగ్గురు ప్రముఖులు...నెహ్రూ, పటేల్, మౌంట్ బాటన్ల ఏకకాల ఆమోదం పొందింది. భారత బ్రిటిష్ ప్రభుత్వానికి రాజ్యాంగ సలహా దారుగా, స్వాతంత్ర్యం అనంతరం, అధికార మార్పిడి, రాష్ట్రం యొక్క రాజ్యాంగ విషయాలు, ప్రధానంగా సార్వ భౌమాధికారం, పాలన, ఫెడరల్ యూనియన్, యూనిట్ల మధ్య అధికార పంపిణీకి సంబంధిం చిన విధానాలపై మీనన్ చేసిన కృషి అనన్య సామాన్యం.

భారత దేశానికి స్వాతంత్ర్యానికి దారితీసిన ప్రసిద్ధ ప్రణాళికను సిద్ధం చేసింది మీనన్. తన పుస్తకం 'ట్రాన్స్‌ఫర్ ఆఫ్ పవర్ ఇన్ ఇండియా'లో, ప్రత్యామ్నా య ముసాయిదా ప్రణాళికను సిద్ధం చేయడానికి తనకు రెండు లేదా మూడు గంటలు మాత్రమే సమయం ఎలా పట్టిందో గ్రంథస్థం చేశాడు. ఆయన ప్రణాళికను పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, మహ మ్మద్ అలీ జిన్నా అంగీక రించారు.

మీనన్ సర్దార్ పటేల్‌తో కలిసి 500 కంటే ఎక్కువ రాచరిక రాష్ట్రాలను యూనియన్ ఆఫ్ ఇండియాలో విలీనం చేయడం పై పనిచేశాడు. ఈ విషయంలో వాస్తవంగా పటేల్ కన్నా మీనన్ చేసిన కృషియే ఎక్కువ. మంత్రిత్వ శాఖ మరియు వివిధ భారతీయ రాచరిక పాలనల మధ్య మంచి సంబంధాన్ని పెంపొందించ డానికి దౌత్యాన్ని ఉపయోగించాడు. పటేల్ రాయబారిగా వ్యవహ రించాడు. భావి భారత స్వతంత్ర దేశానికి ఫ్రేమ్ వర్క్‌ను రూపొందించడానికి అయిష్టంగా ఉన్న రాజులు, పాలకులతో ఒప్పందాలు కుదుర్చు కున్నాడు. మీనన్ తన రచనలైన రెండు సంపుటాలలో స్వతంత్ర్య భారతదేశం, పాకిస్తాన్ రెండు సార్వభౌమ రాజ్యాల ఆవిర్భావానికి దారి తీసిన సంఘటనల చారిత్రక నేపథ్యం వివరించారు. 500 పైగా రాచరిక రాష్ట్రాలను స్వతంత్ర భారత దేశంలో విలీనం చేయ డంలో ఉక్కు మనిషి సర్దార్ పటేల్ కు సహాయం చేసిన ఘనత వహించిన మీనన్ కు దక్కాల్సిన గుర్తింపు దక్కలేదు. ఆయన పేరు మీద ఒక్క జీవిత చరిత్ర లేదు. పాఠశాల సిలబస్‌లో ఆయన రచనల ప్రస్తావన లేదు. ఆయన స్థాపించిన విపి మీనన్ అవార్డు మాత్రమే గుర్తుగా ఉంది. బ్రిటీష్ మరియు స్వతంత్ర భారత దేశ సమర్థ అధికారి, డిసెంబర్ 31, 1965న 72 సంవత్సరాల వయస్సులో బెంగళూరులోని కంటోన్మెంట్‌లోని కుక్ టౌన్‌లో మరణించాడు.



–రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# దళితులు, బలహీనవర్గాల సంక్షేమాన్ని కేటీఆర్ పట్టించుకోలేదు

**300 ఎకరాల అసైన్డ్ భూములు సాగుకు నోచుకోని పరిస్థితి**

**ప్రజా సమస్యల పరిష్కారానికే సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ**

**సభను విజయవంతం చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పిలుపు**



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 29:(నేటినిజం ప్రతినిధి): సిరిసిల్ల నియోజకవర్గంలోని దళితులు, బడుగు, బలహీనవర్గాల సంక్షేమాన్ని మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పట్టించుకోలేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆరోపించారు. సిరిసిల్ల నియోజకవర్గంలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 30న నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం సిరిసిల్లలో ముఖ్యమంత్రి పర్యటన, బహిరంగ సభ ఏర్పాట్లను మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ విజయరమణారావుతో కలిసి పరిశీలించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. 2014 నుంచి 2023 వరకు కేటీఆర్ మంత్రిగా పనిచేసిన సమయంలో సిరిసిల్ల నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోం దని భావించామని మంత్రి తెలిపారు. అయితే, ప్రస్తుతం ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లలో భాగంగా గత వారం రోజులుగా సిరిసిల్ల నియోజకవర్గంలో పర్యటిస్తున్న సమయంలో పెద్ద సంఖ్యలో ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతులు అందిస్తున్నారని చెప్పారు. ప్రత్యేకంగా దళితులు, బడుగు, బలహీనవర్గాలకు సంబంధించిన సమస్యలపై ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో విజ్ఞాపనలు వస్తున్నాయని తెలిపారు. సంక్షేమ పథకాలు అందించాలని కోరుతూ పలువురు తమను సంప్రదిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. సిరిసిల్లలో కరకట్ట నిర్మాణంతో పాటు సివరేజ్ ప్లాంట్ నిర్మాణం కారణంగా దళితులకు అసైన్డ్ చేసిన సుమారు 300 ఎకరాల భూములు సాగుకు నోచుకోని పరిస్థితి ఏర్పడిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. దళితుల సమస్యల పరిష్కారం విషయంలో గత పాలనలో చిత్తశుద్ధి కనిపించలేదని ఆయన విమర్శించారు. దళితులు, బలహీనవర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందకపోవడంతో అనేక మంది దరఖాస్తులతో తమను కలుస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 30న సిరిసిల్లలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సభకు అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు. ముఖ్యమంత్రి పర్యటనతో సిరిసిల్ల నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత ఊతం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.

# ఆర్థిక ఇబ్బందుల నుంచి చదువులో విజయాల దాకా ఎన్‌ఎఫ్ఎస్‌సీ ద్వారా తెలంగాణ మహిళ శ్రీమతి యాట్ల స్రవంతి ప్రయాణం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29:తసకాలంలో లభించే సంస్థాగత సహాయం... విద్యార్థులు ఆర్థికపరమైన అడ్డంకులను అధిగమించి, వారి విద్యా ప్రస్థానాన్ని కొనసాగించి, ఉన్నత విద్య, పరిశోధనల్లో రాణించడానికి తోడ్పడుతుంది. ఆర్థిక పరిమితులు, విద్యా వనరులు పరిమితంగా మాత్రమే అందుబాటులో ఉన్నప్పుడు... అర్హులైన విద్యార్థులు ఉన్నత విద్యను, ఉన్నత పరిశోధనలను అభ్యసించకుండా అవి నిరోధించగలవు.

తెలంగాణలోని కరీంనగర్ జిల్లాకు చెందిన 37 ఏళ్ల శ్రీమతి యాట్ల శ్రావంతి, 'షెడ్యూల్డ్ కులాల కోసం జాతీయ ఫెలోషిప్' (ఎన్‌ఎఫ్ఎస్‌సీ) పథకం కింద ఆర్థిక సహాయంతో వృక్షశాస్త్రంలో తన పరిశోధనను విజయవంతంగా పూర్తి చేశారు. ఆమెకు 2017లో ఫెలోషిప్ సహాయం ప్రారంభమైంది. దీనిలో భాగంగా ఆమె ఫెలోషిప్, ఇంటి అద్దె భత్యం, ఇతర అనుబంధ ఖర్చుల కోసం మొత్తం రూ. 21 లక్షల మేర ఆర్థిక సహాయాన్ని పొందారు.

ఆర్థిక సహాయం అందకముందు... శ్రీమతి స్రవంతి తన ఉన్నత విద్యను, డాక్టొరల్ పరిశోధనను కొనసాగించడంలో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా పుస్తకాలు, పరిశోధనా సామగ్రి, పరికరాలు, హాస్టల్ వసతికి సంబంధించిన ఖర్చులను భరించడం ఆమెకు కష్టంగా మారింది. ఈ పరిమితులు ఆమె చదువు, పరిశోధనపై పూర్తిగా దృష్టి సారించనీయకుండా చేశాయి.

ఆమెకు నాణ్యమైన విద్యా వనరులు, ఇంటర్నెట్ సౌకర్యాలు, విద్యపరంగా సరైన మార్గదర్శనం పరిమితంగానే లభించాయి. మారుమూల ప్రాంతం నుంచి రావడం, సామాజిక–ఆర్థిక ప్రతికూలతలను ఎదుర్కోవడం వల్ల, డాక్టరేట్ స్థాయి విద్యను అభ్యసించడం ఆమెకు సవాలుగా మారింది. ఆర్థిక సహాయం అందుబాటులో లేకపోవడంతో, ఆమె రుణాలు తీసుకోవలసి వచ్చేది. ఉద్యోగం వెతుక్కోవడానికి తన చదువును మధ్యలోనే ఆపవలసి వచ్చేది.

ఎన్‌ఎఫ్ఎస్‌సీ పథకం శ్రీమతి స్రవంతికి ఆర్థిక స్థిరత్వాన్ని కల్పించింది. ఆమె తన డాక్టరేట్ పరిశోధనపై ఎక్కువ సమయం, శ్రద్ధ పెట్టడానికి వీలు కల్పించింది. నెలవారీ ఫెలోషిప్ ఆమె విద్య, జీవన వ్యయాలకు సంబంధించిన ఆర్థిక భారాన్ని తగ్గించడంలో సహాయపడగా... పరిశోధన అనుబంధ నిధి ఆమె విద్యా సంబంధిత పనులకు అవసరమైన ముఖ్యమైన పుస్తకాలు, పరిశోధన సామాగ్రి, సాఫ్ట్‌వేర్‌లను సమకూర్చుకోవడానికి వీలు కల్పించింది.

ఈ ఫెలోషిప్ ఆమెకు జాతీయ సెమినార్లు, వర్క్‌షాప్‌లలో పాల్గొనే అవకాశాన్నీ కల్పించింది. ఈ అవకాశాలు ఆమెకు తన పరిశోధన ఫలితాలను ప్రదర్శించడానికి, నిపుణులతో సంభాషించడానికి, విద్యాపరమైన అభిప్రాయాన్ని స్వీకరించడానికి, వృత్తిపరమైన నెట్‌వర్క్‌లను అభివృద్ధి చేసుకోవడానికి వీలు కల్పించాయి. ఇటువంటి అనుభవం ఆమె విద్యా అనుభవాన్ని బలపరిచి, పరిశోధనా రంగంలోకి ఆమె ప్రవేశాన్ని విస్తృతం చేసింది.

ఎన్‌ఎఫ్ఎస్‌సీ పథకం మద్దతుతో శ్రీమతి స్రవంతి మరింత ఆత్మవిశ్వాసంతో తన పరిశోధనను కొనసాగించి, తన విద్యా సంబంధిత ప్రక్రియలను పూర్తి చేయగలిగారు. ఈ ఫెలోషిప్ ఆమె పరిశోధనా ప్రొఫైల్‌ను బలోపేతం చేయడంతో పాటు... వృత్తిపరంగా పరస్పర సంప్రదింపులు, నెట్‌వర్కింగ్ కోసం అవకాశాలనూ కల్పించింది. వ్యక్తిగత స్థాయిలో, ఆమె కుటుంబంపై ఆర్థిక భారం తగ్గడం వల్ల ఆమెకు మరింత ఆత్మవిశ్వాసం, స్వాతంత్ర్యం లభించాయి.

నేడు శ్రీమతి స్రవంతి ఉన్నత విద్యారంగంలో గానీ, విధాన పరిశోధన రంగంలో గానీ ఉత్తమమైన కెరీర్‌ను నిర్మించుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. సమాజంలో అవకాశాలకు దూరంగా ఉన్న అణగారిన వర్గాల విద్యార్థులకు మార్గదర్శిగా నిలిచేందుకు తన విద్యా అనుభవాన్ని వినియోగించాలని దృఢసంకల్పంతో ఉన్నారు. సరైన సమయంలో లభించే ఆర్థిక చేయూత... విద్యార్థులను, పరిశోధకులను ఆర్థిక–సామాజిక అవరోధాలను అధిగమించేలా ఎలా తీర్చిదిద్దుతుందో, వారు ఉన్నత పరిశోధనలు కొనసాగించి తమలోని విద్యా సామర్థ్యాన్ని ఎలా పరిపూర్ణంగా ఆవిష్కరించుకోగలరో ఆమె ప్రయాణం నిరూపిస్తోంది.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో నిబంధనలు పాటించాలి.

**–జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు.**



ములుగు, సెప్టెంబర్ 29:(నేటినిజం ప్రతినిధి): 2026?27 సీజన్‌లో జిల్లాలోని రైతుల నుంచి వరి ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు.

మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి తో కలిసి కొనుగోలు కేంద్రాల నిర్వహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కొరకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 135 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించడం జరిగిందని తెలిపారు. నిబంధనలకు లోబడి మాత్రమే వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ధాన్యం విక్రయించిన రైతులకు ధాన్యం విక్రయించిన 48 గంటల్లోగా చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం గుర్తించిన 7 సన్న రకాల ధాన్యానికి (ఃఖు 5204, ఖీఔఖీ 15048, ఊఓ ానీనిజీ, ఏజీతి ాతీతితీజీఎ ావణఎవనిబి, ఐఔఓ 1638, చిఉఒ 44, ఐఔఓ 7715) మాత్రమే క్వింటాలుకు 500 రూపాయల బోనస్ చెల్లించడం జరుగుతుందని తెలిపారు.

ఎ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు 2 వేల 461 రూపాయలు, సి గ్రేడ్ ధాన్యానికి 2 వేల 441 రూపాయలుగా ధర నిర్ణయించడం జరిగిందని తెలిపారు. కొనుగోలు కేంద్రము వద్ద నాణ్యత ప్రమాణాలు, మద్దతు ధర సూచించే ప్రత్యేక బ్యానర్‌ను ప్రదర్శించాలని తెలిపారు. ధాన్యాన్ని తెచ్చిన రైతుల వివరాలను వెంటనే ప్రత్యేక రిజిష్టరులో వ్రాసి, ధాన్యాన్ని తెచ్చిన దినము నుండి ప్రతిదినము తేమ కనిష్ట స్థాయి అనగా 17% వచ్చేవరకు పరిశీలించి రోజువారీగా రిజిష్టరులో నమోదు చేయాలని సూచించారు. ధాన్యాన్ని తూకం వేయించే విషయంలో ఎటువంటి అక్రమాలకు, వరుసక్రమ ఉల్లంఘనలకు, తేమరాని ధాన్యాన్ని తూకం వేయడం మొదలగు అవకతవకలకు పాల్పడకుండా సెంటర్ నిర్వహించుటకు భాద్యత వహించాలని, కేంద్ర నిర్వాహకుడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రిమినల్ కేసువంటి తీవ్ర చర్యలు తీసుకొనబడునని హెచ్చరించారు. ధాన్యాన్ని తూకం వేసిన వెంటనే ంః లో నమోదు చేయాలని, తదుపరి వివరములన్ని అచ్చువేసిన రిజిస్టర్ లో నమోదు చేయలన్నారు. ధాన్యం రవాణా కోసం ఉఖూ పరికరం అమర్చిన వాహనాలను మాత్రమే ఉపయెగించాలని ఆదేశించారు.

రైతులకు ఎటువంటి ఇబ్బందులు, ఆలస్యం కలగకుండా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో డి ఎస్ పి రవీందర్, డి ఆర్ డి ఓ రవీందర్, డి సి ఓ రామ్ మోహన్, డి ఎ ఓ సురేష్ కుమార్, డి హెచ్ ఓ సంజీవరావు, డిఎం, డిసిఎస్ఓ కృష్ణవేణి, జిల్లా రైస్ మిల్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్, సంబంధిత అధికారులు, ఐకెపి, పిఏసిఎస్, జిసిసి, ఎంఎసిసి సెంటర్ల నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా నిల్వ చేసిన కలప స్వాధీనం

ఆదిలాబాద్, సెప్టెంబర్ 29: కడెం మండలం ఉడుంపూర్ గ్రామానికి చెందిన అరుగొండ రాజన్న పెరట్లో అక్రమంగా నిల్వ ఉంచిన కలపను అటవీశాఖ అధికారులు మంగళవారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న కలప విలువ సుమారు రూ.1.20 లక్షలు ఉంటుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.


ఉడుంపూర్ అటవీ క్షేత్ర అధికారి (ఎఫ్ఆర్ఓ)కు అందిన రహస్య సమాచారం మేరకు ఉదయం 6 గంటల ప్రాంతంలో అటవీశాఖ సిబ్బంది ఆకస్మికంగా సోదాలు నిర్వహించారు. ఎఫ్‌బీవోలు పరమేశ్వరి, చిక్యాల సునీల్‌కుమార్, పవన్, బేస్‌క్యాంప్ వాచర్లు తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరుగొండ రాజన్న ఇంటి పెరట్లో అక్రమంగా దాచిన కలపను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

స్వాధీనం చేసుకున్న కలపను అటవీ క్షేత్ర అధికారి కార్యాలయానికి తరలించారు. అటవీ ప్రాంతం నుంచి రాజన్న మరికొందరితో కలిసి కలపను తరలించినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని అధికారులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి అరుగొండ రాజన్నను అదుపులోకి తీసుకున్నారు.

# ర్యకర్తలను కాపాడుకునే బాధ్యత కాంగ్రెస్ పార్టీది..

**మంత్రి సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోకన్న గారి సూచనల మేరకు..**

**దశదిన కర్మలకు 10,000 వేల రూపాయలు ఆర్థిక సాయం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు..**



ములుగు, సెప్టెంబర్ 29:(నేటినిజం ప్రతినిధి): తారీకు అనగా మంగళవారం రోజున మంగపేట మండలం లోని బోర్ నర్సాపురం గ్రామానికి చెందిన కర్రీ రామకృష్ణ భార్య తిరుమల గత కొద్దీకాలం నుండి అనారోగ్యం తో బాధపడుతూ హన్మకొండ లోని ప్రవేటు ధవాఖాన లో చికిత్స పొందుతూ స్వర్గస్థులు అవ్వగా ఈరోజు వారి స్వగృహం నందు వెళ్లి ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి దైర్యం చెప్పి ఎల్లవేళలా కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది అని తెలిపి రేపు జరగబోయే దశదిన కర్మలకు గాను 10,000 వేల రూపాయలు ఆర్థిక సాయం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ కార్యక్రమం లో..యువజన కాంగ్రెస్ మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షులు నూతనకంటి రాజు, సీనియర్ నాయకులు..

కబ్బాక లక్ష్మన్, కొబ్బాక శేషు, జోగా రామచంద్రయ్య, నారా నంబయ్య, ఇర్సవడ్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు..

# బెంగళూరులో యూజెనిక్స్ హెయిర్ సైన్సెస్ నూతన సెంటర్

వైజాగ్ , సెప్టెంబర్ 29: హెయిర్ రీస్టోరేషన్ రంగంలో ప్రముఖ సంస్థ యూజెనిక్స్ హెయిర్ సైన్సెస్ బెంగళూరులో నూతన కేంద్రాన్ని ప్రారంభించింది. ఇందిరానగర్‌లోని ఫెదర్‌లైట్ వాంటేజ్, 100 ఫీట్ రోడ్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునిక కేంద్రాన్ని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రారంభించారు.

ఈ కేంద్రంలో ఆరు శస్త్రచికిత్స గదులు ఉన్నాయి. గురుగ్రామ్, ముంబై, హైదరాబాద్, భువనేశ్వర్ కేంద్రాల తర్వాత దేశంలో యూజెనిక్స్‌కు ఇది ఐదో కేంద్రం. బెంగళూరు, కర్ణాటకలోని రోగులకు అత్యాధునిక జుట్టు పునరుద్ధరణ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా సంస్థ దీన్ని ఏర్పాటు చేసింది.

ఈ సందర్భంగా సీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ.. బెంగళూరుకు యూజెనిక్స్‌ను తీసుకురావడం అభినందనీయమన్నారు. సమాచార సాంకేతిక, అంతరిక్ష, జీవసాంకేతిక, వైద్య రంగాల్లో కర్ణాటకకు ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. ప్రపంచస్థాయి వైద్య నిపుణులను, వైద్య పర్యాటకాన్ని బెంగళూరుకు తీసుకురావడంలో యూజెనిక్స్ కృషి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

యూజెనిక్స్ సహ వ్యవస్థాపకుడు, ఎయిమ్స్ న్యూఢిల్లీ పూర్వ విద్యార్థి డాక్టర్ ప్రదీప్ సేథి మాట్లాడుతూ.. రెండు దశాబ్దాల క్రితం రిషికేశ్‌లో చిన్న బెంగళూరు వంటి ఆవిష్కరణలకు కేంద్రంగా ఉన్న నగరంలో సేవలు ప్రారంభించడం సంతోషంగా ఉ ంక్లినిక్‌తో ప్రారంభమైన సంస్థ నేడు దేశ, విదేశాల నుంచి రోగులకు సేవలు అందిస్తోందన్నారు.

మరో సహ వ్యవస్థాపకురాలు డాక్టర్ అరికా బన్సల్ మాట్లాడుతూ.. బెంగళూరు కేంద్రం ద్వారా ఇతర నగరాలకు చికిత్స కోసం వెళ్లాల్సిన రోగులకు తమ వైద్య సేవలు మరింత చేరువవుతాయని తెలిపారు. ప్రతి రోగి అవసరాలను వ్యక్తిగతంగా అర్థం చేసుకుని చికిత్స అందించడమే తమ విధానమన్నారు.

యూజెనిక్స్‌లో వైద్యుల ఆధ్వర్యంలో చికిత్స కొనసాగుతుంది. రోగ నిర్ధారణ, చికిత్స ప్రణాళిక, హెయిర్‌లైన్ రూపకల్పన, దాత ప్రాంతం పరిశీలన, శస్త్రచికిత్సతో పాటు ప్రతి కీలక దశను వైద్యులే పర్యవేక్షిస్తారు. ఈ ప్రారంభోత్సవంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ ఇసుక శిల్పి సుదర్శన్ పట్నాయక్ ప్రత్యేకంగా రూపొందించిన ఇసుక శిల్పాన్ని ప్రదర్శించారు. తెలంగాణ మైనారిటీ సంక్షేమ, ప్రభుత్వ సంస్థల శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్, కర్ణాటక నీటిపారుదల, విజ్ఞాన సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ అజయ్‌ధరం సింగ్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.